ఆదివారం

ప్రజాశక్తి

జూన్ 12, 2005

కథానిలయం
Entered

వృద్ధాప్యానికి చక్కని నీడ

సి.ఆర్.ఓల్డేజ్ హోమ్

హ్యాపీ బర్త్‌డే

12.6.2005 నుంచి 18.6.2005 వరకు



దినేష్
1సం॥, 12.6.2004
సత్యవతి-వెంకట్రావు
గోవిందాపురం-ఖమ్మం

హర్షిత
1సం॥, 15.6.2004
మాధురి-మునిప్రసాద్
శ్రీనివాసకాలనీ-నల్లగొండ

సుభాష్‌నాయక్
3సం॥, 13.6.2002
సునీతాబాయి-డిఎం నాయక్
తూ॥గో

అభినవ్(మున్ని)
2సం॥, 14.6.2003
జ్యోతి-టాగూర్
షోలాపూర్

సుజిత
6సం॥, 15.6.1999
ఇందిర-బాబూరావు
పేటేరు-గుంటూరు

మాలతి
1సం॥, 16.6.2004
శారద-విఠల్
ఆదోని-కర్నూలు

రూపిక
7సం॥, 16.6.1998
సులోచన-పాండయ్య
ఎఫ్‌సిఐ కాలనీ-నల్లగొండ

మానస
జూన్-17
జ్యోతి-రవీంద్రాచారి
శాంతినగర్-మిర్యాలగూడ

దివ్యశ్రీ
4సం॥, 18.6.2001
జ్యోతిర్మయి-శివరామ్
నంద్యాల-కర్నూలు

మహిమ
1సం॥ జూన్-2004
సుజాత-ప్రసాద్
బూరాన్‌దొడ్డి-కర్నూలు

గమనిక: పదేళ్ల వరకు వయస్సు గల చిన్నారులందరికీ ఈ 'హ్యాపీ బర్త్‌డే' శీర్షిక కింద శుభాకాంక్షలు తెలియచేస్తాం. దీనికి మీరు చేయవలసిందల్లా మీ చిన్నారి పుట్టిన రోజుకు 20 రోజులు ముందుగా ఓ కలర్ ఫోటో జత చేసి మీ చిన్నారి పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, చిరునామా వంటి వివరాలు పంపడమే. ప్రజాశక్తి శుభాకాంక్షలతో మీ చిన్నారి పుట్టిన రోజును ఆనందంగా జరుపుకోండి.

పంపవలసిన చిరునామా:
హ్యాపీబర్త్‌డే, ప్రజాశక్తి ఆదివారం అనుబంధం,
1-1-298/4, అశోక్‌నగర్, హైదరాబాద్-20



లీడర్స్ మెయిల్

టు
ఏ ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం

కవర్‌స్టోరీ

29వ తేదీ ఆదివారం అనుబంధంలో ప్రచురించిన "ఏ చదువులు ఎందుకు చదివించాలి" వ్యాసం చాలా బాగుంది. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల అభిరుచులు, ఇష్టాలు తెల్సుకోకుండా డాక్టర్, ఇంజనీర్లు, ఐ.ఏ.ఎస్ ఆఫీసర్ కావాలని బలవంతంగా చేర్పించి చదివించడం వలన పిల్లల్లు చదవలేక ఎలా తయారవుతారో, ఇంకా ఏఏ కోర్సులు చేస్తే ఎలాంటి ప్రయోజనం ఉంటుందో రచయిత చాలా చక్కగా వివరించారు.

జి.వి. నాగయ్య,

ఎర్రగూడూరం, కర్నూలు జిల్లా.

"కవర్‌స్టోరీ-రియల్‌స్టోరీ"

కవర్‌స్టోరీ "ఏ చదువులు ఎందుకు చదివించాలి" అనే వ్యాసం చాలా బాగుంది. వారిని కష్టపెట్టి చదివించడం కన్నా, ఇష్టపడి చదివించడం వలన వారికున్న సహజమైన ఆసక్తిని పెంపొందించి తద్వారా మంచి ఫలితాలు పొందవచ్చు. ఇంకా రియల్ స్టోరీ (వనపిట్ట) "మానిక్ చంద్రచూడ్" ని అభినందించాలి. ఏ కెరీర్‌లోనైనా పబ్లిక్‌స్పీకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ ముఖ్యం. వీటిని అభివృద్ధి చేయాలన్న తలంపు నిజంగా హర్షణీయం. మన పిల్లలు ఎంత బాగా చదువుతున్నారు అనే ఆలోచనతోపాటు, వారు ఎంత బాగా మాట్లాడగలరు అనేది గుర్తించి వారికున్న స్టేజిఫియర్ పోగొట్టాలనే ఆలోచన ఉన్న ప్రతి తల్లిదండ్రులు వారి బిడ్డలకి మంచి భవిష్యత్తును ఇవ్వగలరు.

మద్దా రత్నరాజు,

గవరపాలెం, అనకాపల్లి.

ఈ సంచిక హైలైట్

కవర్‌స్టోరీ ఏ చదువులు ఎందుకు చదివించాలిలో వ్యాస రచయిత నడుస్తున్న అప్రజాస్వామిక అప్రయోజక కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల తీరుతెన్నులకు విద్యా వ్యవస్థ భ్రష్టు బట్టిపోయింది. భవిష్యత్తులో చదివే చదవులకు విలువ ఎప్పుడు ఏర్పడుతుందో విశ్లేషించడం ఈ సంచికకు హైలైట్ అనకతప్పదు.

సిరిపురపు సంపూర్ణ చంద్రిక,

ఎనికేపాడు

విజ్ఞానదాయకం

ఏ చదువులు ఎందుకు చదివించాలనే వ్యాసం వర్తమాన విద్యాధ్యయనానికి అద్దం పడుతుంది. విద్యార్థుల తల్లిదండ్రుల మనస్తత్వాలు విద్యార్థుల ఆసక్తి ఎలా ఉంటుందనే విషయాలు తేటతెల్లంగా వివరించారు. నేటి విద్యావిధానం ధన సంపాదనే ధ్యేయంగా విద్యార్థుల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా కొనసాగుతోంది. శాస్త్రీయ విజ్ఞానం, సామాజిక దృక్పథం మానవ దృక్పథం వంటి విషయాల యందు నేటి విద్యా విధానం నిరాదరణ చూపుతోంది. "ధనం మూలం ఇదం జగత్" అనే ధోరణి సమాజంలో ప్రబలుతోంది. అందుకే, సంపన్న మధ్య తరగతి కుటుంబీకులు తమ బిడ్డలను అధిక వేతనాలు గడించే కోర్సులలో ప్రవేశపెడుతున్నారు. అదే సమయంలో వారు విద్యార్థుల ఆసక్తిని గమనించుట లేదు. అటువంటి తల్లిదండ్రుల దృక్పథం మార్చుటకు ఈ వ్యాసం బాగుగా తోడ్పడుతుందని విశ్వసిస్తున్నాను. సామాజికపు ప్రయోజనకరం, విజ్ఞాన దాయకం, లౌకిక జ్ఞానం వంటి విషయాలెన్నో ప్రచురించిన రచయితకు అభినందనలు.

జి.వి. నరసింహరాజు

రామక్రిష్ణాపురం, రంగారెడ్డిజిల్లా.

జీవనశైలి బాగుంది

29వ తేదీ ఆదివారం అనుబంధంలోని కార్టూన్‌కదంబం, పంచాయితీ కథ, అంపశయ్యనవీన్‌గారి ప్రజాస్వామ్యానికి గ్రహణం, ఆరోగ్యం శీర్షికలో "పొగతాగువాడు ధన్యుడు సుమా" వివరణాత్మకంగా నష్టాల్ని వివరించిన విధానం మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. డెంటల్ క్విజ్-9 చాలా విషయాలను తెలియజెప్పాయి. సెల్యులాయిడ్ శిల్పి పద్మశ్రీ ముజఫర్ అలీ గారి గురించి తెలియజెప్పిన రచయితకు అభినందనలు.

డి.వి. రెడ్డి, అనకాపల్లి.

ఇంతి సంగతులు

మే 22 ఆదివారం అనుబంధంలోని 'ఇంతిసంగతులు' లోని నాడు-నేడు రచన చదివాను. నేటి కాలానికి అనుగుణంగా ప్రతి స్త్రీ మారటం సహజమే అని ఆ కథ ద్వారా తెలిసింది. అయితే చుడీదారీ డ్రస్సులు వేసుకోవటం వలన కలిగే లాభాలను ఇంకా కొన్ని వివరించియుంటే ఇంకా రచన హైలైట్‌గా ఉండేది. ఇలాంటి రచనలు మరిన్ని రచయితచే వ్రాయించగలరని ఆశిస్తున్నాము.

డి. రాధ, వనస్థలిపురం.

ఎడబాటు

22వ తేదీ, ఆదివారం సంచికలో ప్రస్తుతం సమాజంలో టీవి ప్రాబల్యం చాలా ఎక్కువగా ఉంది. ప్రతి కుటుంబంలో టీవి అన్నది ఒక అవసరమైన వస్తువుగా మారిపోయింది. అటువంటి టీవిని ముఖ్య యితివృత్తంగా ఎన్నుకొని కథను నడిపించిన తీరు చాలా బాగుంది. బాలలకథ-పిట్టకొంచెం-కూతఘనం కథను రచయిత మంచి మలుపుతో పిల్లలకు అర్థమయిన రీతిలో చాలా చక్కగా వ్రాశారు. ఈ వారం కళాసాహితిలో కవయిత్రి డా॥భవానీదేవి గురించిన వ్యాసం యువ రచయితలకు ఎంతో స్ఫూర్తిదాయకం.

కొప్పల కాశీవిశ్వేశ్వరరావు,

మర్రిపాలెం-విశాఖపట్నం.

"ఏ పవనాలెటు వీచునో...!"

ఆ మాట అనంగానే ఎవరిక్కావాల్సిన అర్థం వాళ్ళు తీసుకునే రోజులు ఇవి.

కొందరు నిస్పృహతో అంటారే...కలికాలంరా బాబూ కలికాలం అని...అలాంటి చెడ్డరోజులన్నమాట. అలవోకగా, మాటవరుసకు అనే మాటకు బొచ్చెడన్ని అపార్థాలొచ్చే రోజులంటే చెడ్డరోజులన్నమాటే కదామరి!

కాకపోతే ఏవిటి చెప్పండి. "ఏ పవనాలెటు వీచునో..." అని మొన్నీమధ్యనే కేరళ తీరాల ఒంటికి తాకిన రుతుపవనాలు గురించి నేనంటుంటే...కొందరేమో నా మాటకు రకరకాల టీకాటిప్పణులు వేసేస్తున్నారండీ బాబో!

ఆ భారతీయ జనతా పార్టీ మహానాయకుడి మీద ఏం విసురు విసిరారండీ గురువుగారూ...అని కాంప్లిమెంట్ విసిరాడొకాయన. హిందూత్వ మంత్రోచ్చారణ తప్ప వేరేమీ పారాయణం చేయని నోట, "మహమ్మదాలీ జిన్నా సెక్యులరిస్టాయనమః" అని పలికిన సీజన్‌లో "ఏ పవనాలెటు..." అనంటిని కదా! ఇలా తర్జుమా చేసేసుకుని ఉంటాడా పెద్దమనిషి.

ఇంకొక నా పరమాభిమాని, అదేటి సారూ...మనమెంత అరిచినా మాయలోనో, మూఢనమ్మకంలోనో ఉన్న జెనాలు చేపమందుకి లైను కట్టరామరి...గాలి అటే వీస్తోంది కదా అన్నాడు. హైకోర్టువారి మొట్టికాయలు వేశాక "ఈ మందు పనిచేయదహో" అని సర్కారువారు బ్యానర్లు కట్టినా కొరమీనాలను గొంతుల్లోకి తోశారన్నాడు. ఏమైనప్పటికీ గత హవా లేదులేండి అనికూడా రివ్యూ చేసేసి, మళ్ళా నా డైలాగు నామీదకే వదిలాడు... "ఏ పవనాలెటు వీచునో..." అని.

నిజ్జవే సుమండీ...ఎప్పుడే గాలి ఎటు మళ్ళుతుందో ఎవరికెరుక అనంటూ మరోకాయన నా మాట వరుస మాటకు మరో అర్థమీయబోతున్నాడు. కాప్పోతే ఆ సినిమా నిర్మాత అంతంత పెట్టుబడెట్టి తీసిన సినిమా అనుకున్న ముహూర్తానికి విడుదల కాకుండా అప్పులోళ్ళు కాలడ్డవెట్టడవేంటి చెప్పండి అనేసినాడు. దాంతో ఆయన గాలి పోయి ఆత్మహత్యమీదకు గాలి మళ్ళదుమరీ...అని సాగదీశాడు.

హతవిధీ...విధిహతా...నేనన్న పవనాలు...రుతుపవనాలని వీళ్ళకెలా చెప్పాలా అని మదనపడిపోయాననుకోండి.

ఏతావాతా తెలియవచ్చిందేవిటంటే...రుతుపవనాలు దేశం నలుమూలలకూ వచ్చినా రాకపోయినా...ఆంధ్రప్రదేశ్ వినీలాకాశంబునకు మాత్రం ఇప్పట్లో రావేమోనని అంటున్నారు.

బహుశా రాజకీయుల రాజీనామాలు... (వాళ్ళ మధ్య)రాజీలు-నామాలు(ప్రజలకు)పెడుతుంటే...

రుతుపవనాలు కూడా హడలిపోయుంటాయిలేండి!

❖

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం	. . .	4
కవర్‌స్టోరీ	. . .	5
జీవనశైలి	. . .	10
బాలల కథ	. . .	11
బాల నేస్తాలు	. . .	12
ఇంతి సంగతులు	. . .	16
నువ్వుల్లి	. . .	17
ఆరోగ్యం	. . .	18
పుస్తక పరిచయం	. . .	20
కామెంట్	. . .	21
ఓరా	. . .	24

ఇంకా...

రిక్రూట్‌మెంట్

కథ .. 8, 9

రూపశిల్పి

రియల్ స్టోరీ ... 14, 15



తొలి కవితా సంపుటితోనే

కళాసాహితి ... 22, 23



వివేకానందా ఇన్‌స్టిట్యూట్‌లో ప్రతిరోజూ
ఒక గంట ఇంగ్లీషు మాట్లాడటం
నేర్చుకున్నాను.

ఇప్పుడు నేనొక
ఇంగ్లీషు న్యూస్ రీడరా అని
అందరూ అడుగుతున్నారు.

మీ జీవితం కూడా మారాలంటే వివేకానందా ఇన్‌స్టిట్యూట్‌లో ప్రతిరోజూ ఒక గంట గడిపితే చాలు. గత 25 సంవత్సరాలలో 16 లక్షల ప్రజల జీవితం మెరుగుపడింది.

సరళంగా ఇంగ్లీషు మాట్లాడటం నేర్చుకొని
జీవితంలో పురోగమించటానికి
మా ప్రత్యక్ష శిక్షణా కేంద్రంతో నేడే సంప్రదించండి.

HYDERABAD:

S. R. NAGAR...............	☎ 23714330
DILSUKHNAGAR.........	☎ 24044352
VANASTHALIPURAM...	☎ 24122464
MEHDIPATNAM.........	☎ 55755888
A. S. RAO NAGAR......	☎ 55497992
NARAYANAGUDA........	☎ 55155441

RAJAMUNDRY..........	☎ 2422003
KAKINADA..............	☎ 2386638
VISAKHAPATNAM.....	☎ 2738892
VIJAYAWADA...........	☎ 5530053
GUNTUR....................	☎ 2238541
NELLORE..................	☎ 2327702
THIRUPATI................	☎ 2252878
CUDDAPAH...............	☎ 224445
ANANTAPUR............	☎ 241029
KURNOOL	☎ 248099
PRODDATUR.............	☎ 250550

డైరెక్టు కోచింగు క్లాసులలో చేరలేనివారు మా **'హోమ్ స్టడీ కోర్స్'** మూలంగా ఇంట్లో ఉంటూనే తీరిక సమయంలో ఈజీగా ఇంగ్లీషు నేర్చుకోవచ్చు. మొత్తం కోర్సు ఫీజు **రూ. 575/-** మాత్రమే. **(044) 24347034, 24341216** నెంబరుకి ఫోన్ చేస్తే చాలు. కోర్సు పాఠాలు **VPP** ద్వారా మీ ఇంటిని వెతుక్కుంటూ వచ్చేస్తాయి.

VIVEKANANDA INSTITUTE

9, Madley Road, T.Nagar, Chennai-600017.

02 / TEL / 05/ NAGA

కా ర్టూ న్ క దం బం

ఘోరం జరిగిపోయింది
భయ్యా...
బాబోయ్!

చెర పక్షులు
పరోక్ష పద్ధతిలో మునిసిపల్ ఎన్నికలు



మానవ క్లోనింగ్‌కు బుష్ వ్యతిరేకత

పెనుకొండలో గెలిచినప్పటినుంచి ఆ చేయి దించటం లేదు..!

మరికొన్ని భూములు
విక్రయించుమనేలా ఆశీర్వదించు స్వామీ..!

వృద్ధాప్యానికి చక్కని నీడ

సి ఆర్ ఓల్డేజ్ హోమ్

జగదీష్

వృద్ధుల గురించి, వాళ్ల ఆలనాపాలన గురించి, సామాజిక దృక్కోణంతో పట్టించుకుని, వారి మదిలో ఉన్న ఆలోచనలను పదిలంగా కాపాడదగ్గ వృద్ధాశ్రమం ఏదైనా ఉందా? అనేది నా ప్రశ్న. దీన్లో ఏది లోపించినా ఆ వృద్ధ తల్లిదండ్రులకు అన్యాయం చేసినట్లే. అందుకే సమగ్రమైన వృద్ధాశ్రమం గురించి వెతికేందుకని రోడ్డెక్కా... సీనియర్ జర్నలిస్టు ఒకాయన కొండాపూర్‌లో సి.ఆర్.ఫౌండేషన్ ఉంది. ఒకసారి వెళ్లి చూసిరా. నీకు నచ్చి తీరుతుంది అని హామీ ఇచ్చి మరీ పంపించారు. అదే హైదరాబాద్ శివారులోని చంద్రరాజేశ్వరావు వృద్ధాశ్రమం.

కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు

సీఆర్ ఫౌండేషన్ ఏర్పాటు

ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు, సిపిఐ జాతీయ కార్యదర్శిగా పని చేసిన చంద్రరాజేశ్వరరావు స్మృత్యార్థం దీని ని నిర్మించారు. రాజేశ్వరరావు తన చివరి రోజుల్లో సుమారు రెండు దశాబ్దాలకు పైగా బాధాతప్తమైన జీవితాన్ని గడిపారు. ఆరోగ్యం సహకరించకపోవడంతో ఆసుపత్రే ఇల్లయింది. ఇక ముమ్ముందు కొంత మందికైనా ఇటువంటి బాధ లేకుండా చేయాలన్న ఉద్దేశంతో వృద్ధాశ్రమం ఒకటుంటే బాగుండేది అని ఆయన చెప్పేవారు. ఆయన మృతిచెందిన తరువాత, ఆయన చేసిన ఆలోచనలకు అనుగుణంగా ఒక వృద్ధాశ్రమాన్ని నిర్మించేందుకు చంద్రరాజేశ్వరరావు ఫౌండేషన్ ఏర్పడింది. ప్రజల నుంచి విస్తృతంగా విరాళాలు సేకరించి, 1999అక్టోబర్2న (గాంధీ జయంతి రోజు) సి.ఆర్.ఓల్డేజీ హోంను ప్రారంభించింది. ప్రముఖ స్వాతంత్ర సమరయోధురాలు కొండపల్లి కోటేశ్వరమ్మ దీనిని ప్రారంభించారు. హోం ప్రారంభమయినప్పటి నుంచి వృద్ధుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసే కార్యక్రమాలతో పాటు, కుటుంబ వాతావరణాన్ని తలపించే పలు అంశాలను కూడా ఫౌండేషన్ కార్యవర్గం చేపడుతోంది.

'మా అమ్మ ముసల్ది... ఆమెను నా వద్దకు పంపుతానని మా అన్నయ్య చెప్తున్నాడు. ఆయనకేమో అమ్మను చూసుకునేంత తీరిక దొరకడం లేదంట? మరి నాకు దొరుకుతుందా? ఏమన్నానా...నేనూ జాబ్‌కు వెళ్తున్నాకదా!... అమ్మను నా వద్దకు పంపడం ఏమన్నా భావ్యంగా ఉందా?"

"అబ్బా ఈ ముసలివాళ్లతో పడలేక పోతున్నారా బాబూ. వయస్సులో ఉండి తమ పనులు తాము చేసుకునేంత వరకూ వీరంతా మనకు కావాల్సిన వారిగానే కనిపిస్తారు. ఇదిగో ... ఇంకా ఎక్కువ కాలం బతికితేనే ఇటువంటి సమస్యలొస్తాయ్... ఏం చెయ్యాలో నువ్వైనా కాస్త సలహా చెప్పరాబాబూ... ప్లీజ్.."

నా మిత్రులు ఈ మాటలంటుంటే తలతిరిగిపోతున్నట్లు అనిపించేది. ఇన్నాళ్లపాటు తమను పెంచి... పెద్దచేసి... మార్గదర్శకత్వం వహించి... భవిష్యత్ నిర్దేశాన్ని చేసిన వృద్ధ తల్లీదండ్రుల గురించి నేటి తరం ఆలోచిస్తున్న తీరిది... నవమాసాలు మోసి, లోకజ్ఞానం తెలిసే వరకూ ఎన్ని పొరపాట్లు చేసినా 'నా బిడ్డే కదా...' అంటూ సర్దుకుపోయిన తల్లి, 'నా బిడ్డ భవిష్యత్తును చక్కదిద్దేందుకు నేనేదైనా సంపాదించి తీసుకురావాలి' అంటూ జీవితంతో పరుగులు పెట్టిన తండ్రి.. నేటి తరానికి పెద్ద భారంగా కనపడుతున్నారు. అవకాశం దొరికితే ఈ భారాన్ని వేరొకరిమీద నెట్టేయడం... లేదా దించు కునేందుకు ప్రత్యామ్నాయాన్ని ఆలోచించడం ఇప్పటి ధోరణి. 'నన్ను కన్న తల్లిదండ్రులు కదా...' అని చేరదీసి ఆలనాపాలన చేయాలంటే ప్రస్తుత తరానికి 'టైం' దొరకడం లేదు. ప్రపంచీకరణ నిజంగానే 'టైం' దొరక్కుండా చేసింది. ఫలితంగా తల్లిదండ్రులు తమ బిడ్డలతో సేవలు చేసుకునే అవకాశాన్ని కోల్పోతున్నారు.

మరి అప్పుడు వృద్ధులకెవరు దిక్కు?... వారిని చిన్న పిల్లల్లా ఆడించాల్సిన అవసరం లేదు. టైముకు.



భోజనం, ఆరోగ్య రక్షణకు మందులు, పరిశుభ్రత వంటి విషయాలు పట్టించుకుంటే సరిపోతుంది. 'ఇక నా కొడుకుతో పోరాడి లాభం లేదు. వాడు నన్ను చూసేట్టు లేదు. కనీసం వృద్ధాశ్రమంలో వేస్తేనన్నా సరిపోతుంది కదా..!? ఒరేయ్ అబ్బాయ్ నువ్వు ఇలా ఈసడించుకోకురా.. నన్ను అక్కడ పడేస్తే టైముకు ఇంత తిని రామా లక్ష్మణా అంటూ బతుకుతాను కదరా? నీ కెందుకురా ఈ భారం." అంటూ ఈనాటి తల్లిదండ్రులు అడ్జస్ట్ అయిపోతున్నారు.

తల్లిదండ్రులను చూసుకునే టైమును పిల్లలకు లేకుండా చూసిన ప్రపంచీకరణే, ఆ వృద్ధుల ఆలనాపాలన కూడా మార్కెట్ వ్యవహారంగా మార్చివేసింది. దీంతో ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా ఓల్డేజి హోంలు పుట్టుకొచ్చాయి. వీటికి వేల కొద్ది రూపాయలు అప్పనంగా దారపోసి తమ వృద్ధ తల్లిదండ్రులను అందులో దించేసి వెళ్లిపోతున్నారు. వారి ఆలనాపాలనా విషయంలో నాణ్యత ఉందా? లేదా? అన్నది వారికిక అవసరం లేదు. అదే సందర్భంలో డబ్బు వస్తే చాలనుకునే ప్రయివేటు ఓల్డేజీ హోంలు ఆలనాపాలనా వ్యవహారాన్ని కూడా ఎంత సమర్థవంతంగా నిర్వహిస్తాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇన్నాళ్లపాటు నన్ను 'బిడ్డా బాగున్నావా?' అని పలకరించిన 'వాళ్లే' అమ్మానాన్నలు ఎక్కడో ఉండి అష్టకష్టాలు పడడం నాకే మాత్రమూ మింగుడుపడలేదు. అందుకే అన్వేషణను ప్రారంభించా...

ఫలించిన అన్వేషణ...

కొండాపూర్ చౌరస్తాలో బస్సు దిగిన తరువాత హాఫీజ్‌పేట వైపు నడుస్తూ వెళ్లా.. దారి మధ్యలో ఒకరిద్దరిని 'సార్.. ఇక్కడ సి.ఆర్.ఫౌండేషన్ ఓల్డేజీ హోం ఎక్కడుంది?' అని అడిగాను. వారు చెప్పిన అడ్రసు మేరకు అర కిలోమీటరు నడవగానే మెయిన్ రోడ్డుకు కుడివైపు 'సి.ఆర్.ఫౌండేషన్' అనే బోర్డు... దాని ప్రధాన ద్వారం కనపడ్డాయి. వడివడిగా అడుగులేసుకుంటూ ఓల్డేజీ హోంలోనికి అడుగు పెట్టాను. కుడివైపున ఒక గదిలో ఇద్దరు స్త్రీలు కూర్చున్నారు. లోనికి వెళ్లి నేనొచ్చిన పని చెప్పా. 'బాబూ ముందు నీవు నీళ్లు తాగు. ఎండలో పడి వచ్చినట్లున్నావ్.. మొహం పీక్కుపోయినట్లు కనపడుతోంది.' అని చెప్పి నీళ్ల క్యానును చూపించింది. అడగకుండానే నా దప్పికను తీర్చిన ఆమెకు మనసులోని కృతజ్ఞతలు చెప్పుకుంటూ వేగంగా వెళ్లి రెండు గ్లాసుల నీళ్లు తాగేశా. మనసుకు ప్రశాంతత చేకూరిన తరువాత ఆమె సి.ఆర్.ఫౌండేషన్ గురించి, దానికార్యకలాపాలను సవివరంగా వివరించారు. ఆమె ఆ హోంకు మేనేజర్. పేరు పి.సావిత్రి.

అత్యంత ఆహ్లాదకరం... క్రమశిక్షణాయుతం

సి.ఆర్.ఫౌండేషన్ ప్రధాన ద్వారం నుంచి పచ్చని చెట్లు... పక్షుల కిలకిలరావాలు.. అప్పుడే పొడుచుకొస్తున్న ఉషాకిరణాలను ఆస్వాదిస్తూ.. లోనికి అడుగు పెట్టాను. అప్పటికే లోనికీ, బయటకూ తిరుగుతున్న వృద్ధులతో ఓల్డేజి హోం బిజీబిజీగా ఉంది.



ఎక్కువ మంది ఖద్దరు బట్టలు వేసుకుని చేతి కర్రతో భూమిని తటతట తాటుతూ వడివడిగా నడుస్తున్నారు. మరికొంతమంది వృద్ధులు హోం సహాయకుల సహకారంతో అడుగులేస్తూ పార్కుకు చేరుకుంటున్నారు. ఏ ఒక్కరూ ఇన్‌స్ట్రక్షన్స్ లేకుండానే ఒక్కొక్కరూ ఒక్కో తరహా ఎక్సర్‌సైజు చేస్తున్నారు. నడకతో కొంత మంది సరిపెడితే నిలబడ్డ చోటే చేతులూ కాళ్లు ఊపడం, పరిగెత్తినట్లు గెంతటం, యోగాసనాలు వేయడం.. ఇలా జరుగుతోంది. వారి వ్యాయామం. సరిగ్గా ఆరున్నరకు బజర్ (ఎలక్ట్రానిక్ బెల్) మోగింది. అప్పటి వరకు తాము చేస్తున్న వ్యాయామాన్ని ఆపి కొందరు హోం లోపలికి దారి తీశారు. నేనూ వాళ్ల వెంబడే వెళ్లా. హోంలోని డైనింగ్ హాల్లో వేడివేడి కాఫీని స్వీకరించి తమతమ గదులకు వెళ్లిపోయారు. ఇదే అవకాశంగా హోం మొత్తం కలియచూశా. అందులో నాలుగు తరహా గదులు కనపడ్డాయి. ఒకరు, ఇద్దరు, ముగ్గురు కలిసి నివసించేందుకు వేర్వేరు కేటగిరీల గదులున్నాయి. 8 మంది కలిసి ఉండే విధంగా డార్మెటరీలూ ఉన్నాయి. ప్రతీ గదికి, డార్మెటరీకి ప్రత్యేక మరుగుదొడ్లు, స్నానాల గదులున్నాయి. వేన్నీళ్లు పెట్టిచ్చే సౌకర్యం కూడా ఉంది. గంట సమయంలోపు అందరూ స్నానాలు ముగించుకుని తమ తమ గదుల్లోంచి బయటకు వస్తున్నారు. అప్పుడే మళ్లీ బజర్ మోగుతోంది. ఇప్పుడు అందరి చేతుల్లోనూ స్టీలు ప్లేటు, దానిలో బోర్లించిన స్టీలు గ్లాసూ ఉన్నాయి. వీటిని అందరూ తమ తమ గదులనుంచే డైనింగ్ హాల్లోకి తీసుకువచ్చి, టేబుల్ ముందు కూర్చున్నారు. హోం సిబ్బంది ఉప్మా, ఇడ్లీ, వంటి సాదాసీదా ఆరోగ్యకరమైన టిఫిన్‌ను వారందరికీ వడ్డించారు.

అప్పటికీ సమయం ఎనిమిదిన్నర. కొంతమంది గుంపులుగానూ, జంటలుగానూ లైబ్రరీకి, పార్కుకు, రీడింగ్ రూముకు దారి తీశారు. పత్రికలు చదవడం, పుస్తకాలు పఠించడం ఆ సమయంలో వాళ్లు చేసే పని. అన్ని రకాల పత్రికలను హోం అందుబాటులో ఉంచుతోంది. దీంతో వివిధ పత్రికల్లో వచ్చిన విశ్లేషణల ఆధారంగా వారి మధ్య సుదీర్ఘ చర్చలు కూడా చోటు చేసుకుంటాయి... కొన్నింటికి అంతం ఉంటే, మరికొన్నింటికీ అసలు అంతే ఉండదు. మళ్లీ బజర్ మోగే వరకు (10.00గంటలకు) వీరి మధ్య ఇటువంటి సుదీర్ఘ చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆరోగ్యం సహకరించని వారు తమ తమ గదుల్లోకి వెళ్లిపోయి విశ్రాంతి తీసుకోవడమో... లేదా ఒక్కరే కూర్చుని ఏకాగ్రతతో పుస్తకాలు చదవడమో చేస్తారు. బజర్ మోగగానే మళ్లీ డైనింగ్ హాల్ వద్దకు వచ్చేసి హోం సిబ్బంది అందించిన రాగి జావను తాగారు. ఎండాకాలం కనుక చలువ కోసమని హోం దీనిని అందించింది. ఎండ ప్రతాపం ప్రారంభం కావడంతో అందరూ తమ తమ గదుల్లోకి వెళ్లిపోయారు. నేను నేరుగా మేనేజర్ పి.సావిత్రి కార్యాలయంలోకి వెళ్లిపోయా.

'ఇక్కడ ఉంటున్న వారంతా ఎవరు? ఇందులో చేర్చుకోవడానికి ప్రాతిపదికలేంటి?' అని ఆమెను అడిగా. 'వయస్సు 65 దాటి ఉండాలి. ఈ హోంలో అధికంగా విప్లవోద్యమకారులు ఉన్నారు.





తెలంగాణా సాయుధ పోరాటం చేసిన వాళ్లు అనేక మంది ఇక్కడే ఉన్నారు.' అంటూ ఆమె ఒక 20 పేర్లను నాచేతికి అందించారు. 'ఇక్కడ ఎవ్వరు చేరాలన్నా తొలుత పది వేల రూపాయలను డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. మీరు డార్మెటరీలు చూశారు కదా.. అందులో ఎనిమిదేసి బెడ్లు ఉంటాయి. ఒక్కో బెడ్డుకు నెలకు 1600 రూపాయల ఫీజును వసూలు చేస్తాం. ముగ్గురు కలిసి ఉండే గదులకు 2,000, ఇద్దరు కలిసి ఉండే గదులకు 2,100, ఒక్క వ్యక్తి మాత్రమే ఉండదగ్గ గదులకు 2,500 రూపాయలను నెల ఫీజు రూపంలో వసూలు చేస్తాం' అని చెప్పారు. 'కమ్యూనిస్టు నేత చంద్రరాజేశ్వరరావు స్మృత్యార్థం ఈ హోంను నిర్మించారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడి, ఉద్యమాలతో మమేకమైన వారు తమ చివరి రోజులను ఆనందంగా, ప్రశాంతంగా, ఉపయుక్తంగా గడిపేందుకు వీలుగా ఉంటుందని దీనిని రూపుదిద్దారు. ఇకపోతే దీనిని సాధారణ ప్రజానీకానికి అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో బయటివారికి కూడా అవకాశం కల్పిస్తున్నాం. ఇప్పుడీ హోంలో 60శాతం మంది సాధారణ వ్యక్తులే ఉన్నారు." సావిత్రి వివరించారు.

ఇక్కడ చేరాలనుకున్న వారి పేర్లను ఫౌండేషన్ కార్యవర్గం దృష్టికి తీసుకెళ్తారు. కార్యవర్గం అధ్యక్ష కార్యదర్శులుగా మాజీ ఎం.పి. దాసరి నాగభూషణరావు, కార్యదర్శిగా ప్రస్తుత ఎం.పి., సిపిఐ జాతీయ నాయకులు సురవరం సుధాకరరెడ్డి ఉన్నారు. అనుకున్న ప్రకారం ఫీజులు చెల్లించి, నిబంధనలకు అనుగుణంగా ఉంటే ఫౌండేషన్‌లో నేరుగానే సభ్యత్వం దొరికిపోతుంది. 'ఉద్యమాల్లో పనిచేసిన వారు, ఆయా ఉద్యమాల సందర్భంగా సర్వం కోల్పోయి ఉంటారు. అటువంటి వారు ఇక్కడ విశ్రాంతి కోసం వచ్చినప్పుడు ఫౌండేషన్ కార్యవర్గం నిర్ణయం తీసుకుంటుంది. కార్యవర్గం అనుమతితో వీరికి ఉచితంగానే ఫౌండేషన్‌లో సభ్యత్వం ఇస్తాం. ఈ ఖర్చును ఫౌండేషన్ వద్ద ఉన్న డోనర్స్ ఫండ్ నుంచి ఖర్చు చేస్తాం.' అని సావిత్రి చెప్పారు. 'కమ్యూనిస్టు ఉద్యమాలకు ప్రజలే పట్టుగొమ్మలు. వారి సహకారంతోనే ఉద్యమం బతుకుతుంది. సి.ఆర్.ఫౌండేషన్ వృద్ధాశ్రమం కూడా ఒక ఉద్యమమే.. దీనికి కూడా విరాళాలు సేకరిస్తుంటాం.

వీటిని హోం నిర్వహణకు ఖర్చు చేస్తాం..' అంటూ వివరించారు. ఇంతలో బజర్ మోగింది. 'ఓహో 12 అయ్యింది. మనం డైనింగ్ హాల్‌కు వెళ్దాం. ఇది లంచ్ టైం.' అని నన్ను అక్కడకు తీసుకుపోయారు. భోజనం వడ్డించే పరిసరాలు, వండే ప్రాంతం శుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంది. 'ఇక్కడ వెజిటేరియన్ మాత్రమే దొరుకుతుందండి...' అని వడ్డించే వ్యక్తి చెప్పారు. 'నాన్ వెజిటేరియన్ వంటకాలు, మందు ఈ హోంలో నిషేధిత వస్తువులు...' అని వెంటనే సావిత్రి అందుకున్నారు.



భోజనాలు ముగిసిన వెంటనే ఎవరి గదుల్లోకి వాళ్లు వెళ్లిపోయి విశ్రాంతి తీసుకుంటున్నారు. నేను మళ్లీ మేనేజర్ కార్యాలయంలో వెళ్ళాను... 'నేను కొందరితో మాట్లాడతాను' అని చెప్పా. 'ఇప్పుడు వారంతా పడుకుంటారు. డిస్టర్బ్ చేయడం బాగుండదేమో..' అని నన్ను సున్నితంగా వారించారు. ఈ సమయంలో వాళ్లకు ఫోన్లు వచ్చినా ఎత్తుకోరు. గాఢంగా నిద్దురపోతారు.

అందుకే మేమే వాటిని వారికి చేరవేయం. తరువాత చేయాలని చెబుతాం.' అని చెప్పారు. ఆ ఆశ్రమంలో స్వాతంత్ర సమరయోధురాలు సుగుణమ్మ, కొండపల్లి కోటేశ్వరమ్మ, ఇందుకూరి సుబ్బరాజు, టీచర్ల మాజీ నాయకులు భీమశంకరరావు, సిఆర్‌ఫౌండేషన్ నిర్వాహకుల్లో కీలకవ్యక్తి వై.వి.కృష్ణారావు జర్నలిస్ట్‌గా పేరుగాంచిన ఎబికె ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఫ్రీడంఫైటర్ సుగుణమ్మతో మాట్లాడుతుండగానే మూడున్నర గంటలకు టీ వచ్చింది. ఆ తరువాత కొండపల్లి కోటేశ్వరమ్మ వద్దకు వెళ్లాను. వీరిద్దరు తమ తమ గదుల్లో తమ నిజమైన ఇళ్లలాగా భావించి దైనందిన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. అద్దె గదుల్లో ఉంటున్నామన్న భావం ఏ మాత్రం కనిపించలేదు. మిగతా అందరు కూడా ఇంచుమించు ఇదే భావంతో ఉన్నారు. ఇకపోతే ఒకే వయస్సున్న వారు కావడంతో ఒకరు చెప్పేది మరొకరు వినేందుకు కావాల్సినంత ఓపిక కూడా వీరి వద్ద ఉంది. కాబట్టి 'నా మాట నా భావాలు పంచుకునేవారే కరువయ్యారు.' అనే భావం వారి మదిలోకి వచ్చే అవకాశమే లేదు. వీరిద్దరితో సాయంత్రం దాటింది. బయటకు వచ్చి చూస్తే వరండా అంతా నిర్మానుష్యంగా ఉంది. అందరూ ఈవినింగ్ వాక్ కు బయల్దేరారు. అలా వెళ్తూనే నేను ఫ్రీడంఫైటర్ ఇందుకూరు సుబ్బరాజు, టీచర్ల యూనియన్ నాయకుడు భీమశంకరరావులు కలిసారు. అలా ఒక్కొక్కరితో మాట్లాడుతుండగానే చీకటి పడింది. రాత్రి 7.30గంటలకు 'భోజనానికి రండి' అంటూ ఆ రోజులో ఆఖరు బజర్ మోగింది. 'చీకటి పడింది... నే వెళ్తా...' అని మేనేజర్ సావిత్రి వద్ద సెలవు తీసుకున్నా... 'వీరి దినచర్య అప్పుడే పూర్తి కాలేదు. రాత్రి తొమ్మిది పది వరకు రాజకీయాలు, సామాజిక అంశాల మీద, ఇళ్లల్లో సమస్యల మీద వాడివేడి చర్చలు జరుగుతాయి. అలా మాట్లాడుకున్న తరువాతనే వాళ్లు పడుకుంటారు.... 'అని ఆమె చెప్పారు... 'ధన్యవాదాలు... నేనో మంచి ఓల్డేజీ హోంను చూశాను..." అంటూ గుండెల నిండా ఊపిరి తీసుకుని అక్కడి నుంచి ఇంటి దారిపట్టాను. నన్ను 'బిడ్డా బాగున్నావా?' అని పలకరించేవారికి సరైన మజిలీ ఇదేనన్న భావన నాలో అప్పటికే స్థిరపడిపోయింది. ○







కుళ్ళాయప్పకు బడికిపోవటంకన్నా బడిఎగరగొట్టి తిరగటంలోనే ఆనందమూ, లాభమూ కనపడినాయి. లక్ష్మక్క, కుళ్ళాయప్పను బడికి పొమ్మని చెప్పలేదు. వద్దనీ చెప్పలేదు. ఆ విషయమై ఆమెకేమీ పట్టింపులేదు. "కట్టెలూ, నీళ్ళూ తెచ్చి యెక్కడికన్నా వూరేగు" అనేది. తనకే బుద్ధిపుట్టి బడికి పోయినాడు కుళ్ళాయప్ప. తరువాత బుద్ధిపుట్టక చాలించుకున్నాడు.

రిక్రూట్‌మెంట్

దస్తగిరి

లక్ష్మక్కకు ఇద్దరాడపిల్లలు, ఒక కొడుకు. మొగుడు ఆమెను వదలి ఎక్కడకు పోయినాడో యింతవరకు వత్తాలేదు. మొగుడు పరారైనందుకు పెద్దగా బాధేమీ కలగలేదు లక్ష్మక్కకు. ఆయనుండగా కుంటుంబానికి అదనంగా కలిగిన సుఖమూ లేదు. లేనందున అదనంగా కలిగిన కష్టమూ లేదు. సంకలో బిడ్డ, కడుపులో బిడ్డ, కాన్పురోజు కూడా కూలికి పోకపోతే ఆ పూట 'మమ్మ'కు గతిలేదు. మొదటి కాన్పు పుట్నింటిలో అయితే చివరిరెండు కాన్పులు కూలికిపోయిన చేన్లో చెట్లకిందనే. ఒక్కగానొక్క కొడుకు కుళ్ళాయప్ప.

కుళ్ళాయప్ప చదువుకోటానికి ఆ వూరిలో ప్రభుత్వ పాఠశాల వుంది. స్వంతభూమి సెంటుకూడా లేకపోయినా కూలిపని చేయటానికి ఆ వూరికి విస్తారమైన భూములున్నాయి. జీతగానిగా పెట్టుకోడానికి పెద్దపెద్ద రైతులూ వున్నారు. యివేగాక జూదం, దొంగతనం లాంటి మార్గాలూ వున్నాయి.

బద్దే గుండ్లు, సిల్లాకట్టె, కోతికొమ్మచ్చి, బలిగుడు ఆడేదానిలో కనిపించిన ఉల్లాసం బడిజీవితంలో కనపడలేదు కుళ్ళాయప్పకు. జతగాళ్ళతో కట్టెలకు పోయి కల్లకంపలు గీసుకుపోయినా లెక్కచేయక చేన్లోకి, తోటల్లోకి దూరి ఎత్తుకరావటం, కావలివారు తరుముతూ వస్తే 'బతికితిమి! సస్తిమి!" అని కేకలతో హెచ్చరించుకుంటూ పరిగెత్తటం, దిబ్బగుంతల్లో సీమజాలి చెట్టుకింద వొదిగిన కోళ్ళను గుట్టల్లోకి ఎత్తుకొనిపోయి, తుప్పుపట్టిన చాకుతోనో, బేల్‌కడ్డీతోనో, అదీయిదీ లేకపోతే బోకుపంచతో వాటి గొంతుకోసి, చీల్చి, కాల్చుకొని పీక్కుతినటం లాంటి సాహసాలలో కనపడినంత ఉల్లాసం, తృప్తి బడి జీవితంలో లేదు. నక్కాముష్టి, రాణి, పూలు వంటి డబ్బులాటల్లో చూపించే నేర్పరితనానికి వచ్చే పొగడ్తలూ, పైసలూ అతన్ని ఆనందపరిచేవి. ప్రోత్సాహపరిచేవి.

ఇవన్నీ గమనించిన కొందరు అనుభవజ్ఞులు "చెట్టుపైన గూట్లో పొదిగిన పక్షికి తెలియకుండ దానికింది గుడ్లు ఎత్తుకొచ్చే టక్కరి" అని తేల్చినారు. వీడిట్లే పెరిగితే పూర్లో యెవరూ బతకర్రోయ్! ప్రమాదంరోయ్!" అని హెచ్చరించారు.

మొదట్లో కుళ్ళాయప్ప ప్రధానవృత్తి కూలి. ఉపవృత్తి దొంగతనం. రానురాను దొంగతనమే ప్రధానవృత్తి అయింది.

కూలిపని అందరూ చేయవచ్చుగానీ దొంగతనం అందరూ చేయలేరు. ఆ వూరిలో కొందరికి కూలీలతోనే కాక దొంగలతోకూడా చాలా అవసరముంది. తక్కువధరలో వస్తువులు సమకూర్చుకోవటానికీ తమ ప్రత్యర్థులను దెబ్బతీయటానికీ అవసరం.

మొదట కుళ్ళాయప్ప కోళ్ళదొంగగా గుర్తింపు పొందినాడు. సాధనతో రానురాను ఆల్‌రౌండర్‌గా రాటుతేలినాడు.

ఒకరోజు శ్రీరాములు గారి గుడ్లకోడి కనపడలేదు. ఆయన వూర్లోలేరు. కోడి పోయినందుకు ఆయన భార్యకు చాలా దుఃఖంగా వుంది. ఇతరుల వస్తువుల్ని ముట్టుకోవటం తప్ప తన వస్తువుల్ని చూసిస్తానన్నా ఒప్పుకొనే రకం కాదామె. అందుకు తనకోడి, అందునా గుడ్లకోడి పోయినందుకు కోపంగా కూడా వుంది. దొంగ దొరికితే కసకసా నమిలి ముక్కలు చేయాలన్న కసీవుంది. వేపమాను చెట్టుకింద "కోడిపాయక్కమ్మ కోడిపాయనే! కోడిపోతే పీడపాయ! గంపడంత బొచ్చుపాయ!" అని వక్కాకునోటితో పాడుతూ కుళ్ళాయప్ప కులుకుతుంటే జీతగాళ్ళని పంపింది శ్రీరాములు భార్య. వారు కుళ్ళాయప్ప బనీను పట్టుకొని యిగ్గకొచ్చినారు. ఆమె కుళ్ళాయప్పని కంబానికి కట్టేసి కాలాసేతా తన్నింది. బర్రలతో వాతలు పెరికింది. దఫ దఫాలుగా కొట్టి కసి తీర్చుకుంది. "అరిఅర బ్రమ్మాదులొచ్చినా యిడిసిపెట్టెల్లే"దంది. కోళ్ళదొంగ బాధితులు కొంతమంది వచ్చి అగ్నికి ఆజ్యం పోసినారు. తల్లి లక్ష్మక్క వచ్చి ఎంత వేడుకున్నా, ఏడ్చినా వదల్లేదు. ఆమె మంకు పట్టును, పరిస్థితి తీవ్రతనూ గుర్తించి గాడిదను చంపి గల్లుకు పోయినట్లు వుంటుందని శ్రీరాములు బంధువులూ, శ్రేయోభిలాషులూ వచ్చి కుళ్ళాయప్పను వదిలిపెట్టినారు.

కుళ్ళాయప్ప ఇదివరకు తిట్లుతిన్నాడు. ఓ రకమైన దెబ్బలూ తిన్నాడు. శ్రీరాములు భార్యచేత దెబ్బలు తిన్నంతసేపూ బాధగా వున్నా, ఆ దెబ్బలతో దెబ్బల భయం తీరింది కుళ్ళాయప్పకు. అప్పటికి అతని వయస్సు పదైదు పదారేండ్లు.

శ్రీరాములు ప్రత్యర్థి సుబ్బిరెడ్డి, కుళ్ళాయప్ప ఇంటికి వచ్చినాడు. సానుభూతి తెలిపి అన్యాయం సహించలేనన్నాడు. "ఊరా? వల్లకాడా?" అని ఆవేదనతో ప్రశ్నించినాడు. కేసుపెట్టి అన్యాయస్థులను శిక్షిస్తామని అన్నాడు. అందుకయ్యే ఖర్చంతా తానే భరిస్తానన్నాడు.

అందుకు లక్ష్మక్క "అప్పా! రొడ్డి! నమస్కారం! మన బంగారం మంచిది కానప్పుడు వొకర్ని తప్పుపట్టే పనేముంది? ఒకసారి కేడీ అయితే ఇంక తర్వాత తప్పు సేసినా, సేయకపోయినా కేసు మోస్తుంది. తగదురా! తగదురా! అని యెంతసెప్పినా యిన్నాడా ఈ దుష్టుడు?" అని కొడుకు ముగాన ఎంగిలుమిసింది "యెంత అవమానం తెస్తివిరా?". అని కాలితో తొక్కేసిపోతే చిన్నపాప అడ్డుకుంది.

కథ

కుళ్ళాయప్ప మాత్రం అప్పకాళ్ళేసుకొని, కూర్చోని కదలక మెదలక బొద్రాయిలా వున్నాడు.

"అయ్యా మానుబావుల్లారా! సాముల్లారా! మీరేమి తక్కువైనోల్లుకాదు. కన్నోల్లసొమ్ము అగ్గవగా దొరుకుతుందని, ముప్పై రూపాయల సొత్తు అయిదుకే దొరుకుతుందని యీన్ని ప్రుదెక్కించేది ఏం న్యాయమప్పా? పసికందుకు బుద్దిసెప్పే పని ల్యా? వాళ్ళు కోడి తినేది. ఓ గెంటి పులుసునీళ్ళకే యీడు తన్నులు తినేది. యిప్పటికైనా తెల్సుకోరా బేవకూఫ్!" అని కొడుకును మల్లా కొట్టబోయింది. చిన్నపాప మల్లా అడ్డుకుంది. "మీకు మొక్కుతాము దయసేసి మావాన్ని యిడిసిపెట్టండి" అని చేతులెత్తి మొక్కింది.

"చెవిటిపెట్టు. వొప్పించటం కష్టం" అంటూ సుబ్బిరెడ్డి లేచిపోయినాడు.

❀ ❀ ❀

ఆ వూరోల్లు కొంతమందితోపాటు కరువులో బతుకుకోసం, పనులకోసం లక్ష్మక్క పిల్లలతోపాటు గుంటూరుకు పోయినారు. టికెట్టు లేనందున అమరావతి ఎక్స్‌ప్రెస్సులో పట్టుబడినారు. వారం రోజులు పోలీసులు స్టేషన్‌లో పెట్టినారు. అయితే ఈ దరిద్రులను భరించలేక వదిలేసినారు. కాలినడకన గుంటూరు చేరినారు. తీరా అక్కడకు పోతే పోటీ జాస్తీ. అక్కడ కూడా పస్తులు తప్పలేదు. అదనంగా రోగాలు. తట్టుకోలేక పదిరోజులకే ఇంటికి బయలుదేరినారు. ఛార్జికి డబ్బులులేవు. రైలులో పట్టుబడటం, దించివేయటం కొంతదూరం నడవటం, మరల రైలెక్కడం, మరల నడక చివరికి వూరు చేరినారు.

"యేం సంపాదిస్తుకొస్తివి లక్ష్మక్కా?"

"యేం సంపాదిస్తావ్? పానాలతో వొచ్చిండేదే సంతోషం, యెల్లో క్రుష్ణా సముద్రం సూస్తిమి" అని జన్మతరించినట్లుగ సంతోషంతో చెప్పింది.

కానీ కుళ్ళాయప్ప మాత్రం "ఇట్లా అల్కాపనులు' ఎప్పుడూ చేయకూడదనీ, ఒకరోజు కష్టపడి పదిరోజులు దర్జాగా కూర్చొని తినే "రాజా పనులే" చేయాలనీ నిశ్చయించుకున్నాడు.

వస్తువులు సమృద్ధిగా వున్నా, కృత్రిమకొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌తో ఇబ్బడిముబ్బడిగా లాభాలు సంపాదించినట్లుగానే కృత్రిమ అపాయాలు సృష్టించి డబ్బు చేసుకోవడం నేర్చుకున్నాడు కుళ్ళాయప్ప.

వంకలు పారే వర్షం వస్తే అందరికీ ఆనందమే. బావుల్లోకి నీళ్ళు వస్తాయనీ కడుపునిండా తాగటానికి నీళ్ళుంటాయనీ, పంటలు పండుతాయనీ అందరికీ సంతోషమే. కానీ, కుళ్ళాయప్ప సంతోషమే వేరు. నేషనల్ హైవే రోడ్డులో కాజ్‌వే వంతెనలో గుంతలు తొగి, యిరుక్కుపోయిన లారీలను, కార్లను బైటికి నెట్టి డబ్బులు సంపాదిస్తాడు కుళ్ళాయప్ప. అందుకొక గుంపునూ తయారుచేసుకున్నాడు.

భగవంతుడొక్కడే. అయినా ఆ వూర్లో నలుగురు మగదేవతలు, ఒక ఆడదేవత వుంది. అందరూ పూజలందే దేవతలే. అయినా ఆస్తిపరంగా లెక్కకడితే ఒకోదేవుడ్ది ఒకో స్తోమత. ఆ వూరిలో నరసింహస్వామి మిగతావారి కంటే ఎక్కువ ఆస్తిపరుడు. పెద్ద దేవాలయం వుంది. భూమి వుంది. ఆభరణాలున్నాయి. కంచు విగ్రహముంది. పల్లకీ వుంది. వడ్డీలకు తిరిగే నగదువుంది. ఆంప్లిఫ్లేయరు గ్రామఫోను, మైక్‌సెట్టు వుంది.

కుళ్ళాయప్ప ఈ సౌండ్‌సిస్టమ్ ఎత్తుకపోయి అమ్ముకున్నాడు. ఆ మరునాటిరోజు జరిగిన వీర్లవెరవణిలో వీర్ల స్వామిని-దొంగ ఎవరో తేల్చుమనీ, సత్యం చూపమనీ నిలేసినారు. దేవుని చేతకానితనాన్ని తిట్టినారు. దేవుని శక్తిపట్ల ఎగతాళీ చేసినారు. స్వామి అన్నీ భరించినాడు కానీ నోరు తెరవలేదు. స్వామిని ఎత్తుకున్న బాలిరెడ్డికి దొంగవిషయం తెలిసినా దేవుడే వూరుకున్నప్పుడు నాకెందుకని ఆయనా నోరెత్తలేదు. దొంగ ఎవరో అందరికీ తెలుసు. అయినా పోలీసు రిపోర్టులో దొంగపేరు మాత్రం చెప్పలేదు. పేరు చెబితే జరిగే అనర్థాలు అందరికీ తెలుసు. భయభ్రాంతకరమైన సంఘటనలు వారిముందున్నాయి.

గతంలో శ్రీరాములకు చెందిన నాలుగుబావుల యింజన్లు ఒకే రాత్రిలో మటుమాయం. మంత్రశక్తి లాంటి కండబలము, రాక్షసుని బండ మొరటుతనము వుండే వ్యక్తి తప్ప ఇతరులు ఆ పని చేయలేరు. ఆ బండమనిషి కుళ్ళాయప్ప తప్ప మరెవరూ కాదని కరాఖండిగా అందరికీ తెలుసు. అంతేగాక సారాయికి డబ్బుయివ్వలేదని రామదాను చెనిక్కాయవాముకి నిప్పుపెట్టినాడు. ఇరవైవేలు నష్టం. టైలర్ మాబూసాబ్ తనను తిట్టినాడని దారికాచి అతన్ని నలగ్గొట్టినాడు.

కుళ్ళాయప్పను ఎంతకొట్టినా కొట్టించుకుంటాడు. కాని, అతనితో ఒక దెబ్బతినడానికి అందరికీ ముఖ్యంగా "నామూదార్ల"కు భయం. అతడు చేతితో కొట్టడు. చెప్పుతోనే కొడతాడు. అది చాలా అరిష్టదాయకం. శాంతికోసం చాలా తతంగం చేయాలి. అంతచేసినా మాయనిమచ్చగా మిగిలిపోతుంది. పైగా కుళ్ళాయప్ప సుబ్బిరెడ్డి మనిషి. ఎంతవరకైనా అండగా వుంటాడు. అందువల్ల తమ వస్తువుల రక్షణార్థం, తమ మానప్రాణం రక్షణార్థం నోరుమూసుకొని సహిస్తారు.

చివరకు ఒకనాడు...

కుళ్ళాయప్ప సుబ్బిరెడ్డి వాళ్ళమ్మనే చంపినాడు. చంపడంలో చాలా దారుణంగా చంపినాడు. అర్థరాత్రి యింటివెనుక దొడ్లో కావలిపడుకున్న సుబ్బిరెడ్డి అమ్మను దూరంగా గుట్టల్లోకి ఎత్తుకొని పోయి మానభంగం చేసి; పెద్దరాయితో తలను పిచ్చలు చేసినాడు. కుళ్ళాయప్ప తన దొంగసొత్తును ఆమె దగ్గర దాచినాడు. ఎపుడూ జరిగేదే. యిటీవల పెండ్లిబస్సు దోచినపుడు తనవాటాగా వచ్చిన బంగారు ఆభరణాలు, వాచ్‌లు, డబ్బుకట్టలూ ఆమె దగ్గర దాచాడు. ఆ కేసు విషయమై కుళ్ళాయప్పను పోలీసులు చిత్రహింసలు పెట్టినారు. కీళ్ళుకీళ్ళు విరిచినారు. 'రోకలిబండ' ట్రీట్‌మెంటు ఇచ్చినారు. శరీరాన్ని నుజ్జు నుజ్జు చేసినారు. కొంచెం కేసు సద్దు మణిగిన తరువాత వచ్చి అడిగితే అవి వాపసు యివ్వలేదు ఆమె. అంత బాధలు అనుభవించి సంపదను రక్షించుకుంటే ఆమె ఉల్టాగా ఎగరగొట్టజూస్తే, కబళించజూస్తే, పైగా పోలీసులకు

చెప్తానని బెదిరిస్తే అతనీ దారుణం చేసినాడు.

విషాదమేమిటంటే సుబ్బిరెడ్డి తన మాతృమూర్తి హంతకుడెవరో తెలిసీ అతనిపైన కేసు పెట్టలేకపోయినాడు. గత సంబంధాలన్నీ బయటపడతాయని భయం. పోలీసులే కుళ్ళాయప్పను అరెస్టు చేసినారు. ఈసారి వారు కుళ్ళాయప్పను చితగ్గొట్టలేదు. కొత్తపెండ్లి కొడుకువలె చూసినారు. అతన్నువపయోగించి డబ్బులు చేనుకున్నారు. కుళ్ళాయప్పను బేడీలతో జీపుల్లో అర్థరాత్రి తెచ్చినారు. హత్యానేరం కింద శ్రీరాముల్ని మరికొందరిని పట్టుకొనిపోయినారు.

ఆ దెబ్బతో వూర్లో డబ్బున్నవారందరూ ఏ పక్షానికి చెందినప్పటికీ వూరు వదలి కొండగుట్టల్లో రోజుల తరబడి అజ్ఞాతవాసం చేసినారు. మనం పెంచిన పాము మనల్నే కాటేసిందని ఒకరికొకరు చెప్పుకున్నారు. బంధువుల యిండ్లకుపోయి రికమెండేషన్లకు ప్రయత్నించినారు. చాలామంది అత్యంత సమర్థుడైన ఒక మునిసిపల్ కౌన్సిలర్ ద్వారా ప్రయత్నించినారు. అరెస్టు చేయకుండా వుండటానికీ, కొట్టకుండా వుండటానికీ, కేసులో యిరికించకుండా వుండటానికీ బేరం లేకుండ కౌన్సిలర్ చెప్పిన రేటు చెల్లించినారు.

దొరకకుండ, రేటు చెల్లించకుండ వున్న మిగిలిన వారికోసం మరో అర్థరాత్రి రెండోవిడత వచ్చినపుడు కుళ్ళాయప్పకు పోలీసులమీద ఏం అనుమానం వచ్చిందో ఏమో కొంతమంది ఇండ్లు చూపిస్తూ, చూపిస్తూ వారికండ్లుగప్పి కొండగుట్టల్లోకి పారిపోయినాడు. పారిపోయి మునిసిపల్ కౌన్సిలర్ శరణుజొచ్చినాడు.

కౌన్సిలర్ చిన్నపాటి గాడ్‌ఫాదర్. కుర్చీలు, షామియానా, వంట పాత్రల సరఫరా అంగడివున్నట్లు వృత్తి హంతకుల, గూండాల అంగడి పెట్టినాడు. ఆయనకు చాలామంది రాజకీయ ప్రముఖులతో, అధికారులతో సత్‌సంబంధాలు వున్నాయి. తన కులస్థుడైన ఒక రాజకీయ ప్రముఖునికి కుడి భుజంలాంటివాడు. అతనికి సంబంధించిన గలాటా వ్యవహారాలన్నింటికీ ఈయనే ఇన్‌ఛార్జి. ఆయనకు పరారై వచ్చిన కుళ్ళాయప్పను చూస్తే ముచ్చటేసింది. వికృతమైన వ్యక్తిత్వం, ధ్వంసమైన ఆత్మతో కుళ్ళాయప్ప వచ్చినాడు. అదే అర్హతగా ఆయన తన వృత్తి హంతకుల సైన్యంలోకి తక్షణమే కుళ్ళాయప్పను రిక్రూట్ చేసుకున్నారు. ✪

మోతబరువు!

ముదిగంటి సుజాతారెడ్డి

లలిత తన వక్కింట్లో వుండే స్నేహితురాలితో వచ్చింది.

"సుశ్రీ! ఈమె విమల. విమల కూతురు రవళి మూడేండ్లది. ఎల్‌కేజీలో చేర్పించటానికని ముందుగానే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే స్కూలుకు వెళ్ళి వస్తున్నాం." అని లలిత విమలతోపాటు సోఫాలో కూర్చుంది.

"మంచి నీళ్ళు ఏమైన..." అడిగాన్నేను ఎండలో వచ్చిన వాళ్ళవైపు చూసి.

"నువ్వు కూర్చో. నేను తెస్తాను మంచినీళ్ళు" అని లలిత వంటింట్లోకి వెళ్ళింది.

"ఏమ్మా...! రిజిస్ట్రేషన్ అయిందా." విమలను అడిగాన్నేను.

"అయిందండి. ఫీజులన్నీ పే చేసాం. జూన్‌లో క్లాసులు మొదలవుతాయన్నారు. ఫీజులు బాగానే వున్నాయి. ఫీజులు పోగా డొనేషన్ అని పెద్ద మొత్తమే తీసుకున్నారు. అయినా ఏం చేస్తాం! ఏ స్కూల్లో అయినా అంతే వుంది. ఇంటికి దగ్గర్లో వున్న మంచి స్కూల్లో చేర్పించాలని, ఈ స్కూల్లో కొంత ఫీజు డొనేషన్లు ఎక్కువే వున్నా అక్కడికే వెళ్ళాం. మొత్తం మీద సీటు దొరికినందుకు సంతోషించాలి. చాలా రష్! అడ్మిషన్ల కోసం చాలామందే వచ్చారు! ఫీజులు ఎక్కువైనా ఇయ్యాలి! తప్పదు కద!"... అని చెప్తున్నది విమల... లలిత ట్రేలో మూడు మంచి నీళ్ళ గ్లాసులతో వచ్చింది.

"ఫీజులు ఎక్కువే. దాంతోపాటు పిల్లలకు చదివే లోడ్ ఎక్కువే!..." అంది లలిత. ముగ్గురం మంచినీళ్ళ గ్లాసులు తీసుకొని తాగాం.

"అవునండి! స్కూలు యూనిఫారం వాళ్ళే ఇస్తామన్నారు. షూస్, స్కూల్ బ్యాగ్ కొనాలి. ఏవో కొన్ని నోట్‌బుక్స్ పెన్సిళ్ళు కావాలని లిస్టు ఇచ్చారు. అవన్నీ స్కూలు మొదలయ్యేటప్పటికి కొనాలి"! అంది విమల.

"ఎల్‌కేజీలో కూడా స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్ పెన్సిళ్ళు ఎందుకో అర్థం కాదు. వాటితో వాటర్‌బాటిల్, టిఫిన్ డబ్బా... వాళ్ళకు హాఫ్ డే స్కూలయినా అవి తప్పవు. అవన్నీ కలిసి మూడేళ్ళ పిల్లలకు బాగానే బరువు మోత అవుతుంది" అన్నాన్నేను.

"అస్సలు మన స్కూళ్ళల్లో సరైన ట్రెయినింగ్ తీసుకున్న 'కిండర్‌గార్టెన్' స్థాయిలో చదువు చెప్పే టీచర్లు లేకనో యేమో ఎల్‌కేజీ నుంచే అక్షరాలు, అంకెలు, శబ్దాలు, లెక్కలు చెప్పటం చేస్తుంటారు. మొన్న జర్మనీ నుంచి వచ్చిందే మా బావగారి కూతురు సరళ... ఆమె చెప్తూవుంది అక్కడ ఫస్ట్ స్టాండర్డ్ అంటే ఒకటో తరగతి నుంచి మాత్రమే అక్షరాలు అంకెలు నేర్పుతారట. జర్మనీలో ఫస్ట్ స్టాండర్డ్ విద్యార్థికి ఆరేళ్ళు నిండాలట. ఆరేళ్ళు నిండితేనే చేర్చుకుంటారట ఆ క్లాసులో. కొన్ని రోజులుగాని కొన్ని నెలలుగాని తక్కువున్నా చేర్చుకోరట. అంటే నాలుగేండ్ల నుంచి రెండేండ్లు "కింటర్ గార్టెన్" చదువాల్సిందే. కింటర్ గార్టెన్ అనే పదం జర్మన్ భాషా పదమట. కింటర్ అంటె పిల్లలు అని, గార్టెన్ అంటే తోట అని అర్థమట. పిల్లలకు తోటలో ఆడుకున్నట్లుగా క్రమశిక్షణ బుద్ధులు నేర్పేదే "కింటర్ గార్టెన్!" లలిత వివరంగా చెప్తుంటే నాకాశ్చర్యమైంది.

"చాలా సమాచారం పోగుచేసావే లల్లీ!" అన్నాన్నేను చిరునవ్వుతో.

"అంతేగాదు. మనలా రికమెండేషన్లు నడవవు ఆ దేశాల్లో. చచ్చినట్లు ఆరేండ్లు నిండితేనే పిల్లల్ని ఫస్టుక్లాసులో చేరుస్తారు. కాని అంతకన్నా ముందుగా ఆరాటపడ్తూ సిఫారసులు తేవటం వుండదట!... ఇదంతా సరళ చెప్పిందే సుశ్రీ!" అంది లలిత.

"అది సరే. కేజీ క్లాసుల్లా పసిపిల్లలమీద అంతంత చదవటం, వ్రాయటాలను రుద్దటం చాల అన్యాయం లల్లీ! అది పిల్లల్ని, వాళ్ళలేత మెదళ్ళను హింసించటమనాలి. ఆ లేత వయస్సులో పిల్లల మెదళ్ళకు ఆలోచనా పద్ధతులను, క్రమశిక్షణలను నేర్పాలి. వాళ్ళకు ఆ వయస్సులో పాటలు అంటే రైమ్స్ నేర్పాలి. వాటితోనే వాళ్ళ మెదడు ఎదిగేట్లుగా చేయాలి. కాని లేత వయస్సులో పుస్తకాలను చదివించటం, వ్రాయించటం అనేది పెద్ద గుదిబండలా తయారవుతున్నది". అన్నాన్నేను. ఇంతసేపు నిశ్శబ్దంగా వింటున్న విమల నోరు విప్పింది.

"అంతేనండి! వాళ్ళకు బ్యాగ్, వాటర్ బాటిల్, టిఫిన్లు ఈ బరువంతా శారీరకంగా గుదిబండ అయితే క్లాసుల్లో ఏ ఆటపాటలు లేకుండా చదువులు చెప్పటమో గుదిబండ అవుతున్నది. అంత లేత వయస్సులో వాళ్ళను శారీరకంగా మానసికంగా ఎదగనీయకుండా చేస్తోంది మన చదువులు"

"విమలా! నువ్వనేది అక్షరాల నిజం. అయితే చిన్నపిల్లలకు ఇదంతా గుదిబండలా తయారవుతుంది అనీ, ఈ చదువుల బరువును తగ్గించాలని అందరూ అంటారు. దేశం రాష్ట్రపతి దగ్గర్నుంచి రాష్ట్రంలోని ప్రాథమిక విద్యామంత్రి వరకూ అందరూ అంటారు. పట్టుదలతో పట్టించుకునేవాళ్ళు గాని, అమల్లోకి తెచ్చేవాళ్ళు గాని లేరు. ఇదెట్లావుందంటె పిల్లిమెడలో గంట నువ్వే కట్టాలి నువ్వే కట్టాలి అన్నట్లుగా వుంది. కాని ముందుకు వచ్చి కట్టేవాళ్ళెవరూ కన్పించరు" అంది లలిత కాస్త ఆవేశంగానే.

"ఇది అంత పెద్ద సమస్య కాదనిపిస్తుంది. అంటె ఈ పసిపిల్లల మోతబరువును దింపటం అంత పెద్ద సమస్య కాదేమో! కాని అందరూ పై నుంచి కింది వరకూ మార్పురావాలని అనే వాళ్ళు కాని పనికి పూనుకునేవాళ్ళు లేక అట్లానే వుండిపోతున్నది" అన్నాన్నేను.

'పెద్ద సమస్య ఎందుక్కాదు సుశ్రీ! ముందుగా అటువంటి మోంటిస్సోరీ పద్ధతిలో చెప్పగల టీచర్లను ట్రెయినింగ్ యిచ్చి తయారుచేయాలి. టీచర్లు దొరికిన పరిస్థితిలో విద్యావిధానాన్ని ప్రవేశపెట్టటం ఏమంత కష్టం కాదు అనుకుంటాను" అంది లలిత సమస్యను తీర్చటమెట్లాగో చెప్తూ.

"నిజమే! లల్లీ! ముందుగా ఆ టీచింగ్ పద్ధతులు తెలిసినవాళ్ళు కావాలి. అప్పుడు స్కూళ్ళల్లో ప్రవేశపెట్టటం ఏం కష్టం కాదు" అన్నాన్నేను లలిత చెప్పిన ఉపాయాన్ని అంగీకరిస్తూ.

"అంటె అటువంటి టీచర్లను తయారుచేసే ట్రెయినింగ్ సంస్థలు బయలుదేరాలి. టీచర్లు అందుబాటులో వుంటే ఆ విద్యావిధానం వెంటనే ఏ ఆటంకాల్లేకుండా అమలవుతుంది" అంది విమల.

"నిజమే విమలా! పసిపిల్లలకు క్రమశిక్షణ నేర్పి, వాళ్ళ మేధస్సుకు శాస్త్రీయమైన హేతుబద్ధమైన ఆలోచనా విధానాన్ని అలవరిచే విద్య కన్నా మించిన విద్య ఏముంటుంది. ఆలోచించటం నేర్పింతర్వాత, పిల్లలు పెరిగింతర్వాత ఏ విద్యనైనా క్షణంలో నేర్చుకుంటారు. అప్పుడు అవగాహన లోపంగాని, ఆచరణలో తడబాట్లుగాని వుండవు! గట్టిగా తల్చుకుంటె అటువంటి విద్యావిధానాన్ని "కింటర్ గార్టెన్" లో ప్రవేశపెట్టటం పెద్ద ఆటంకాలుగాని ఇబ్బందులుగాని ఏం వుండకూడదు" అన్నాన్నేను.

లలిత విమల అవునన్నట్లుగా తలలు పంకించి మౌనంగా వుండిపోయారు.

ఎలుకలు - ఏనుగులు



మేకల మదన్‌మోహన్ రావు



అదొక మారుమూల ప్రాంతం. అక్కడ కొన్ని ఎలుకలు నివసిస్తూ వుండేవి. ఓనాడు ఒక ఏనుగు తన వంద సహచర ఏనుగులతో కలిసి ఆ ప్రాంతానికి వచ్చింది. అవన్నీ ఎంచక్కా అక్కడ లభించిన ఆహారాన్ని ఎంతో ప్రీతిపాత్రంగా ఆరగించాయి. దాంతో వాటికి దాహం వేసింది. 'నీళ్ల ఎక్కడ దొరుకుతాయా!' అని చూస్తుండగా వాటికి పక్కనే ఓ సరస్సు కనిపించింది. అంతే! అవి సంతోషంతో తొండం పైకెత్తి పెద్దగా అరుస్తూ సరస్సు దగ్గరకు బయలుదేరాయి. అప్పుడు వాటి కాళ్లకిందపడి చాలా ఎలుకలు చనిపోయాయి.

దాంతో ఎలుకలు చాలా కంగారుపడ్డాయి. ఇలా అయితే తమ జాతే అంతరించిపోతుందని భయపడ్డాయి. చావగా మిగిలిన ఎలుకలు ఆ ఏనుగుల నాయకురాలి దగ్గరికి వెళ్లాయి. "నాయకులవారికి నమస్కారం. మేం మీకు చెప్పేంతటి వాళ్లం కాము. కానీ ఒక విన్నపం చేయాలనుకుంటున్నాం. మీ కాళ్లతో తొక్కి మమ్మల్నిలా నాశనం చేయకండి. మమ్మల్ని చంపకుండా వదిలిపెట్టండి. ఎప్పుడైనా మీకు అవసరం వచ్చినప్పుడు కాకితో కబురుపంపినా సహాయం చేస్తాం" అంటూ బతిమాలాయి.

వాటి ప్రార్థన విని ఏనుగు జాలిపడింది. "సరే! మీరు మమ్మల్ని అడిగిన తీరు మాకు నచ్చింది. అందుకే వదిలేస్తున్నాం' అంది ఎలుకలతో. తర్వాత తన తోటి ఏనుగులతో 'ఒక్క ఎలుక కూడా కాళ్లకింద పడి నలిగిపోకూడదు. జాగ్రత్తగా నడవండి" అని ఆజ్ఞాపించింది.

ఆ తర్వాత చాన్నాళ్ల గడిచిపోయాయి. కొందరు ఏనుగులను పట్టుకునేవాళ్లు వచ్చి వీలైనన్ని ఏనుగులను పట్టసాగారు. చాలా వరకూ ఏనుగులు వాళ్ల చేతుల్లో చిక్కాయి. మిగిలిపోయిన ఏనుగులు తమ నాయకుని దగ్గరకు వెళ్లి విషయం చెప్పాయి.

ఆ వార్త వినగానే దానికి ఎలుక మిత్రులు గుర్తొచ్చాయి. అంతేకాదు. "అవసరానికి ఆదుకుంటాం" అని చెప్పిన వాటి మాటలు కూడా జ్ఞాపకమొచ్చాయి. వెంటనే వాటికోసం కబురు పంపింది ఏనుగుల నాయకురాలు.

వెంటనే వందల కొద్దీ ఎలుకలు బిలబిలమంటూ వచ్చాయి. ఒకప్పుడు ఏనుగులు తమకు చేసిన సహాయాన్ని అవి మరువలేదు. ఎలుకలు చక్కగా చిన్న చిన్న గుంపులుగా విడిపోయాయి. ఎక్కడెక్కడ ఏనుగులు వలలో చిక్కుకున్నాయో, అక్కడికి వెళ్లాయి. తమ వాడి దంతాలతో ఆ వలల తాళ్లను కొరికేశాయి. ఏనుగులు బంధ విముక్తులయ్యాయి.

ఆ ఏనుగుల నాయకుడు ఎలుకలకు కృతజ్ఞతలు తెలిపాడు. అప్పటి నుండి ఎలుకలు, ఏనుగులు మంచి మిత్రులుగా సంతోషంగా వుండసాగాయి.



బాతుపిల్ల మడుగును చేరేదెలా!



బాలనేస్తాలు

ఒకేరకమైన యాపిల్స్ మూడు కావాలంటే...



హేయ్ పిడుగులూ! ఆదివారం కదా అని హాయిగా టీవీ చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారేమో. అదేం కుదరదు. మేం మిమ్మల్ని ఓ ప్రశ్న వేస్తాం. దానికి చిటికెలో సమాధానం చెప్పాలి. రెడీనా!

ఒక బుట్టలో రకరకాల యాపిల్ పళ్లు కలగాపులగంగా వున్నాయి. మాకు ఒకేరకమైన యాపిల్ పళ్లు మూడు కావాలి. మీరే తీసివ్వాలి. మామూలుగానైతే క్షణంలో ఇచ్చేస్తారు. కానీ... మీరు కళ్లు మూసుకుని తీసివ్వాలి. అలా ఒకేరకమైన 3 యాపిల్ పళ్లను తియ్యాలంటే... కనీసం బుట్టలోంచి ఎన్ని పళ్లు తీసుకోవాలి? సమాధానం కావాలంటే... కుడిచేతివైపు జవాబుల్లో చూడండి.

ఎన్ని అడుగులు?



అనగనగా ఒక ఎద్దు వుంది. పాపం దాని పని ఏంటంటే... పొలం దున్నటమే. అది ఓ రోజుంతా కష్టపడి పొలం దున్నింది. మట్టిలో నడిస్తే కాలి ముద్రలు పడతాయికదా. మరి ఆ ఎద్దు కాలి ముద్రలు పొలంలో ఎన్ని వుండివుంటాయి? బాగా ఆలోచించి చెప్పాలి. తెలీకపోతే జవాబుల్లో చూసెయ్యండే.

నేనెవరిని?

హాయ్ః బుల్లి నేస్తాలూ! ఇంతకీ నేనెవరో చెప్పనేలేదుకదూ. ఆ (ః)దే మరి తమాషా అంటే. నేనెవరో మీరే చెప్పాలి. కాకపోతే కొన్ని ఆధారాలు చెప్తాన్లే. నేను ఆంగ్ల అక్షరం Tతో మొదలవుతాను. (ః)ంతేకాదు అదే అక్షరంతో ముగుస్తాను. ఇంతేకాదర్రా! నా నిండా కూడా Tనే వుంటుంది. మరి నేనెవరిని? చెప్పుకోండి చూద్దాం.

చిన్నారి చి

ఎస్.నిఖిత, 7వ తరగతి,
ఠాగూర్ విద్యాలయం,
పల్లిపాడు, ఖమ్మం.

ఎమ్.నాగరాజు, 7వ తరగతి,
జిహెచ్ఎస్స్కూల్, బిసిహాస్టల్,
కొండపి, ప్రకాశం.

వీరి వీరి గుమ్మడిపండు...
వీరి పేరేమి?

హలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చినవారెవరో చెప్పకోండి చూద్దాం. ఈయన మంచి నటుడు. అంతేకాద ర్రా! కేంద్రమంత్రిగా కూడా చేశారు. ఏంటి? జవాబు చెప్పేస్తారా? మాకు వినిపించదుకానీ... కార్డుమీద రాసి పోస్ట్ చేయండి. మీరు రాసిన సమాధానం సరైనదైతే మీ పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. ఓకేనా. మా చిరునామా: **వీరి వీరి గుమ్మడిపండు**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.

29.5.05 కు సరైన సమాధానం రాసినవారు

రత్నరాజు, 6వ తరగతి, ఫిరంగిపురం, రసూల్‌పేట. ఎల్.స్రవంతి, 8వ తరగతి, జవహర్ నవోదయ విద్యాలయం, మద్దిపాడు, ప్రకాశం. వి.మధుసూదన్‌రావు, 10వ తరగతి, బుద్దారం, నేలకొండపల్లి, ఖమ్మం. ఎం.డి.యాసీన్ ఫాతిమా, వ తరగతి, తన్నీరు సాయిరాజేష్, 6వ తరగతి, బాలవిద్యానికేతన్ స్కూల్, కల్లూరు. కె.జయమాధురి, 5వ తరగతి, తణుకు. ఎం.అలేఖ్య, 5వ తరగతి, కల్లూరు, ఖమ్మం. జి.సాయిభరత్‌రెడ్డి, 6వ తరగతి, మోదుకూరు, గుంటూరు. ఎం.ప్రవీణ్‌రెడ్డి, 3వ తరగతి, మోదుకూరు, గుంటూరు. బి.రవికిరణ్‌రెడ్డి, 8వ తరగతి, హన్మకొండ. కాలువ శ్రీతన్మయ, 3వ తరగతి, బ్రాడీపేట, గుంటూరు. ఎం.అవినాష్, 7వ తరగతి, ఎం.అభిషేక్, 3వ తరగతి, కంచారం, శ్రీకాకుళం. ండారు జ్యోతిర్మయి, 5వ తరగతి, కమలాపురి కాలనీ, బంజారాహిల్స్, హైదరాబాద్. ఆసియాబేగం, 3వ తరగతి, ఠాగూర్ హైస్కూల్, షాద్‌నగర్, మహబూబ్‌నగర్.

5.6.05 జవాబు
లాల్ బహదూర్ శాస్త్రి

రంగులు పులిమేద్దాం

...త్రకారులు

గొల్లజాపు హిమజ,
7వ తరగతి,
రాజీవ్‌గాంధీ యుపిస్కూల్,
పెద్దాపురం,
తూర్పుగోదావరి.

పి.గీతాదేవి, 8వ తరగతి,
జి జి హైస్కూల్, మూసారంబాగ్.

జవాబులు

ఒకేరకమైన యాపిల్స్ మూడు కావాలంటే...

కళ్లు మూసుకుని 7 యాపిల్స్ తీస్తే సరి. ఒకేరకమైనవి 3 వచ్చేస్తాయి.

ఎన్ని అడుగులు?

ఏంటి బుజ్జాయిలూ! ఇంకా తెలీలేదా? లేకపోతే విపరీతంగా ఆలోచించేసి విసిగిపోయారా! సరే చెప్పేస్తున్నాం. ఎద్దు రోజంతా పొలం దున్నితే బోలెడన్ని అడుగులుంటాయని అనుకుంటున్నారుకదూ. కానేకాదు. ఒక్క అడుగుకూడా వుండదు. ఎందుకంటే దానితోపాటే నాగలికూడా వుంటుందికదా. అది ఆ అడుగులన్నిటిని బుద్ధిగా చెరిపేస్తుంది కాబట్టి.

నేనెవరిని?



ఇంకా తెలీలేదా! నేనర్రా! Tea potని. Tతో మొదలవుతాను. Tతో ముగుస్తాను. నా నిండా కూడా Tనే వుంటుంది. హ్హా...హ్హా..హ్హా.

పూణే నగరంలో మారుమూల సందు. అక్కడ పాతబడిన ఇంటి ముందుభాగాన్ని అందంగా రూపొందించి ఒక గదిగా మార్చారు. ఆ గదిలో వస్తువులన్నీ పద్ధతి ప్రకారం సర్దినట్లుగా ఉన్నాయి.

పెద్ద టేబులు, ఆ టేబుల్ ముందు కంప్యూటర్, ఆ పక్కన ప్రింటరు... పక్కన ఉన్న అలమారలో ఫొటో ఆల్బంలు అన్నీ వరసగా ఉన్నాయి.

టేబుల్‌పైన చిన్న నేమ్‌ప్లేట్ మీద "పూర్వి సోంపురి, ఆర్కిటెక్" అని ఉంది.

పొత్తూరి రాజేంద్రప్రసాద్‌వర్మ

రూపశిల్పి

"మీ గురించి చాలామంది వద్ద విన్నాను. ఎన్నో దేవాలయాలు నిర్మించిన అనుభవం మీకు ఉంది. మీరే మా దేవాలయాన్ని కూడా నిర్మించాలి!" ఆ వ్యక్తి అభ్యర్థించాడు.

సోంపురి చిన్నగా నవ్వింది.

"దేవాలయం నిర్మించడం చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఎంతో సమయం పడుతుంది. శిల్ప నైపుణ్యాలతో నిర్మించాలంటే వ్యయం ఎక్కువ అవుతుంది".

"ఎంత అయినా పర్వాలేదు. మేమంతా కలిసికట్టుగా ఈ ప్రాజెక్టు చేపట్టాం. ఆంధ్రప్రదేశ్‌లో భీమిలి అనే చిన్న గ్రామం ఉంది. అక్కడ కొండవార దేవాలయాన్ని సామూహికంగా నిర్మిస్తున్నాం. మీ గురించి పత్రికల్లో చదివాం. మీ వంటివారు మా దేవాలయ నిర్మాణానికి రూపకల్పన చేస్తే బాగుంటుందని అందరం నిర్ణయించుకున్నాం. వారి తరుపున ప్రతినిధిగా నేను వచ్చాను!" ఆ వ్యక్తి చెప్పాడు.

అతని మాటలు విని పూర్వి సోంపురి ఆశ్చర్యపోయింది. "ప్రస్తుత పరిస్థితుల్లో నాకున్న పనుల వత్తిడిలో మీ దేవాలయాన్ని నిర్మించడం కుదరదు. అయినప్పటికీ అంతదూరం నుంచి నన్ను వెతుక్కుని వచ్చారు. గాబట్టి మీ కోసం ఆలోచించవలసి వస్తోంది!"

"మేడం! మీరు కాదనకూడదు... మేం ఖర్చుకు వెనుకాడటం లేదు. మీ ఆధ్వర్యంలో మీ పర్యవేక్షణలో మేం దేవాలయాన్ని పూర్తి చేయాలనుకుంటున్నాం!"

"దేవాలయానికి కంప్యూటర్ డిజైన్‌తో స్కెచ్ ఇస్తాను... పనివారిని మీరే పెట్టుకోండి. ప్రారంభసమయంలో వచ్చి వారికి సూచనలు ఇస్తాను. మధ్యలో ఒకసారి వచ్చి పరిశీలిస్తాను. పూర్తయిన తర్వాత ముగింపు నిర్మాణం సమయంలో వస్తాను. అంటే మీ దేవాలయ నిర్మాణంలో కేవలం మూడుసార్లు మాత్రం రాగలను. అలా అయితే చెప్పండి... మీ దేవాలయ ప్రాజెక్టుకు డిజైన్ చేస్తాను".

సోంపురి మాటలు అతనిలో ఉత్సాహాన్ని కలిగించాయి.

మీ వంటి వారి ఆధ్వర్యంలో మా

దేవాలయం నిర్మాణం జరగడం ఆనందంగా ఉంది. మీ అవకాశం మేరకే పర్యవేక్షణ చేయండి. మీరు స్కెచ్ ఇస్తే నేను పట్టుకుని వెళ్లి ముహూర్తం ఖరారు చేసుకుని ముందుగా మీకు ఫోన్ చేస్తాను. ఆ సమయానికి మీరు వస్తే సరిపోతుంది!" అన్నాడు.

ఆమె వద్ద సెలవు తీసుకుని రూముకు వెళ్ళిపోయాడు. రెండురోజుల తర్వాత ఆమె గీచిన ప్లాను, కంప్యూటర్ డిజైన్ వివరాలు, నిర్మాణంలో పాటించవలసిన సూచనలు తీసుకున్నాడు.

తర్వాత భీమిలి బయలు దేరాడు.

❀ ❀ ❀

గుజరాత్ ప్రాంతంలో ఫాలితానా ప్రాంతానికి చెందిన సోంపురి. భారతదేశంలోనే మొట్టమొదటి మహిళా దేవాలయ ఆర్కిటెక్‌గా పేరు పొందారు. సాధారణంగా నిర్మాణ పన్నులన్నీ పురుషులే చేస్తుంటారు. దేవాలయాలు, ఆలయ కుడ్యాలు, ధ్వజస్తంభాలు మొదలైనవన్నీ పురుష శిల్పులే నిర్మిస్తుంటారు. వీరిని 'స్తపతులు' అంటారు.

అయితే పూర్వి మహిళా శిల్పిగా పేరు పొందింది.

ఫాలితానా అనే ప్రాంతంలో సోంపురా అనే బ్రాహ్మణ జాతికి చెందినవారు శిల్పశాస్త్రంలో ఎంతో ప్రావీణ్యం సంపాదించారు. కొన్ని తరాల నుంచి ఈ కుటుంబీకులే దేవాలయాల నిర్మాణాలను చేస్తుంటారు. ప్రఖ్యాతి చెందిన సోమనాథ్ దేవాలయాన్ని కూడా ఈ కుటుంబీకులే నిర్మించారని చరిత్ర చెబుతోంది.

అటువంటి కుటుంబానికి చెందిన పూర్వి చిన్నతనం నుంచి దేవాలయ నిర్మాణాల పట్ల ఎంతో ఆసక్తిని పెంపొందించుకుంది.

ఈమె పుట్టిన ఫాలితానా ప్రాంతంలో 800 జైన దేవాలయాలు దగ్గర దగ్గరలోనే ఉన్నాయి. ఈ పరిసర ప్రాంతాల్లో పెరగడం, దేవాలయాల్లో సంచరించడం వల్ల నిర్మాణాల పట్ల ఆసక్తిని పొందింది.

తండ్రి, తాత, వారి అనుచరులు, ఇతర నిర్మాణ పనివారు చేసే పనులను చిన్నతనం నుంచి పరిశీలించేది. కళాకారుల ద్వారా రాళ్లకు సంబంధించిన భాషను కూడా తెలుసుకుంది.

భవనాల నిర్మాణాలను సిమ్మెంటుతో చేస్తారు. కాని పవిత్రమైన దేవాలయాలను చల్లదనం ఉండటానికి, గట్టిదనం శాశ్వతత్వం ఉండేందుకు గ్రానైట్, సున్నపురాయి, ఇసుకరాయి, ఎర్రరాయి వంటివి ఉపయోగించే విషయాలను పూర్వి తెలుసుకుంది.

ఈమెకు దేవాలయాలు వాటి నిర్మాణాలపై ఉన్న ఆసక్తిని తాత హరగోవింద్‌సింగ్ గమనించారు. పూర్వీకుల నుంచి వస్తున్న అపురూపమైన ప్రతులను ఆమెకు అందజేశారు. దాంతో పూర్వికి మరింత ఇష్టం పెరిగిపోయింది. స్త్రీలు ఎవరూ కనీసమైన ఆసక్తిని

చూపించని దేవాలయ నిర్మాణరంగంలో అద్భుతాలను సాధించాలని ఆమె భావించింది.

దేవాలయ నిర్మాణరంగ విషయంలో కొన్ని సంవత్సరాలుగా రహస్యంగా ఉండిపోయిన విషయాలను ఆమె తాత, తండ్రి ఇతర కుటుంబ సభ్యులను అడిగి మరీ తెలుసుకుంది.

దేవాలయ నిర్మాణంలో ఉన్న ఆసక్తికి అనుగుణంగానే ఇంటీరియర్ డిజైనింగ్‌లో ప్రత్యేకంగా శిక్షణ పొందారు. వివిధ రకాల నిర్మాణ పనులు ఏ విధంగా చేయాలో పూర్వి తెలుసుకుంది.

1986లో ఆర్కిటెక్ట్‌గా జీవితాన్ని ప్రారంభించింది.

కంప్యూటర్ సాయంతో ఆమె నమూనాలను రూపొందిస్తారు. దేవాలయ నిర్మాణంలో కాంతి, శబ్దం, వాతావరణం, దిశ వంటి రకరకాల అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. పునాదుల వద్ద ఇసుక వాడతారు. ఫలితంగా గుడిలో శీతాకాలంలో వెచ్చదనం, ఎండాకాలంలో చల్లదనం ఉంటుంది. పై కప్పు విషయంలో కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తారు. ఇసుక వాడటం వల్ల శబ్దకాలుష్యం ఉండదని ఆమె నమ్ముతారు.

ఆర్కిటెక్టుగా బాధ్యత స్వీకరించిన తర్వాత మొట్టమొదటిసారిగా ముంబాయి ముక్తేశ్వర్ మహదేవ్ మందిర్‌లో వివిధ నిర్మాణాలు చేపట్టడం ద్వారా దేవాలయ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత వివిధ ప్రాంతాల్లో పూర్వి అనేక రకాల దేవాలయాలను నిర్మించారు.

అల్మోడా ప్రాంతంలో రాజ్‌రాణి గుడిని ఈమె ప్రత్యేకంగా నిర్మించారు. సాధారణ దేవాలయాల కన్నా ఇది భిన్నంగా ఉంటుంది. వలయాకారంలో ఉండే శిఖరం చక్కగా చెక్కి ఉంటుంది. పురాతన తాల్‌చురీ శైలిలో దీని నిర్మాణం చేపట్టారు. భూకంపాలను తట్టుకొనే విధంగా ప్రత్యేక పద్ధతితో ఈ దేవాలయాన్ని నిర్మించారు. ఎన్నో రకాల జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఎంతకాలమైనా చెక్కు చెదరకుండా ఉంటుంది. గుజరాత్‌లో తులసీశ్యామ్ దేవాలయానికి మరమ్మతులు చేసే పని పూర్వికి లభించింది. దేవాలయ మరమ్మతులు చేసే సమయంలో అందులో విగ్రహం ఏ మాత్రం దెబ్బతినకుండా పూర్వి జాగ్రత్త పాటించారు.

ఈ విధంగా భారతదేశంలో మొట్టమొదటి దేవాలయ రూపశిల్పిగా పూర్వి సోంపురి పేరు ప్రఖ్యాతులను సంపాదించారు.

అది ముంబయి.

దేవాలయ నమూనాల ప్రదర్శన.

ఆడిటోరియంలో గోడలకు పెద్దసైజు రంగురంగుల ఫోటోలతో అలంకరించారు. ఒకొక్క ఫోటోలో ఒకో రకమైన దేవాలయ నమూనా ఉంది. అది పూర్వీ సోంపురి ఏర్పాటు చేసిన ప్రదర్శన.

అంతవరకూ పూర్వి వివిధ ప్రాంతాల్లో నిర్మించిన దేవాలయాల ఫోటోలను అందులో ప్రదర్శించారు. ఆ దేవాలయం ఏ ప్రాంతంలో ఎప్పుడు నిర్మించారో, అందులో వాడిన మెటీరియల్ వంటి వివిధ విషయాలను వివరిస్తు నోట్సు కూడా పక్కన ఉంచారు.

ప్రదర్శన చూసిన వారికి దేవాలయ నిర్మాణాల గూర్చి పూర్తి అవగాహన కలుగుతుంది.

మొదటి ప్రదర్శన పూణేలో ఏర్పాటు చేయగా అనూహ్యమైన స్పందన వచ్చింది. ఆ స్ఫూర్తితో ముంబాయిలో రెండవ ప్రదర్శన ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమం పుర ప్రముఖులను ఎంతోమందిని ఆకర్షించింది. ఇంతవరకూ ఫోటో ప్రదర్శన, చిత్రాలు, బొమ్మలు వంటి ప్రదర్శనలను చూసిన వారికి దేవాలయాల నమూనాల ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది.

చాలామంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రదర్శన ఏర్పాటు చేసి సాయంత్రం సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.

ఈ ప్రదర్శనలో దేశ విదేశాల్లో పూర్వి ఆధ్వర్యంలో నిర్మించిన అనేక దేవాలయాల నమూనా



చిత్రాలు ఫోటోలను ప్రదర్శించారు.

అందులో ప్రధానంగా జపాన్‌లో రెండువేల రాళ్లతో నిర్మించిన 16 అడుగుల రాతి స్థూపం కూడా ఉంది. జపాన్ దేశంలో నిర్మితమైన ఆ కట్టడం భారతదేశానికి చెందిన మహిళాశిల్పి నిర్మించారంటే చూసిన వారికి ఆశ్చర్యం కలిగించింది.

ఏడుగంటలకు సమావేశం ప్రారంభమైంది.

పుర ప్రముఖులతో పాటు పూర్వీ సోంపురి కూడా వేదికను అలంకరించింది. ప్రదర్శన ఏర్పాటుకు సహకరించిన స్వచ్ఛంద సంస్థ ఒకటి ఇందుకు తగిన ఏర్పాట్లు చేసింది.

ఒకొక్కరు పూర్వీ గొప్పతనాన్ని వివరించారు.

వివిధ ప్రాంతాల్లో ఆమె ఏయే దేవాలయాలను డిజైన్ చేసి నిర్మించారో నగర మేయర్ వివరించారు. దేవాలయాల నిర్మాణంలో ఆమె చూపించే ప్రతిభ నిర్మాణంలో తీసుకుంటున్న జాగ్రత్తలను, దేవాలయాల పనితనంలో ప్రత్యేకతలను ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసనసభ్యులు వివరించారు. ఇటువంటి ప్రదర్శనల వల్ల ఎటువంటి ప్రయోజనం కలుగుతుందో మరికొంతమంది వివరించారు.

అనంతరం సన్మాన కార్యక్రమం జరిగింది.

పుర ప్రజలు ప్రముఖుల ఆధ్వర్యంలో శాలువా కప్పి పూలదండలు వేసి సన్మానం చేశారు. నిర్వాహకుల తరపున మెమెంటోను బహుకరించారు.

ఆ సమయంలో ఓ వ్యక్తి స్టేజి వద్దకు వచ్చాడు.

అతని చేతిలో పేపరు చుట్టిన ఫోటో ఉంది.

నిర్వాహకుల అనుమతి తీసుకుని ఫోటోను పూర్వీకి అందజేశాడు. అందరూ దానికి చుట్టిన కాగితాన్ని విప్పి ఫోటోను ప్రదర్శించారు.

కొండవారలో నిర్మించిన దేవాలయ చిత్రం. ఆ దేవాలయాన్ని భీమిలలో పూర్వీ ఆధ్వర్యంలోనే నిర్మించారు. ప్రారంభోత్సవం కూడా జరుపుకున్నారు.

ఫోటోను చూడగానే పూర్వి కళ్లల్లో ఆనందభాష్పాలు.

వందలమైళ్ల దూరంలో తన పర్యవేక్షణలో నిర్మించిన దేవాలయం ఫోటో రూపంలో తనముందు సాక్షాత్కరించడం ఆమెకు ఎంతో ఆశ్చర్యం కలిగింది. దేవాలయ నిర్వాహకులపైన అభిమానం కలిగింది.

భీమిలి నుంచి వచ్చిన నలుగురు యువకులు ఆ ఫోటో అందజేసి పూర్వీతో కలసి ఫోటో తీయించుకున్నారు.

తర్వాత ఆమెకు మాట్లాడే అవకాశం వచ్చింది. ఒక నాటి పనితనాన్ని తిరిగి తీసుకురావాలని ఆలోచనలో ఉన్నాను. దేవాలయ నిర్మాణ శైలిని ఆధునిక అవసరాలకు అనుగుణంగా మార్చే ప్రయత్నంలో ఉన్నాను. అందరి ప్రోత్సాహం కోసం ఈ ప్రదర్శన నిర్వహించాను. నన్ను ప్రోత్సహించారు. ఎన్నో నిర్మాణాలు చేసిన నాకు, నా పనితనానికి ఖరీదు కట్టే వారే తప్ప పనితనాన్ని గుర్తు చేసినవారు లేరు. నా గురించి తెలుసుకుని నాతో దేవాలయాన్ని నిర్మించుకుని నా సన్మానం నాడే నేను నిర్మించిన దేవాలయ నమూనా ఫోటో బహుకరించడం అందమైన అనుభవం మరిచిపోలేని ఆనందం... ఈ బహుమతి, నాకు చేసిన సన్మానానికి సన్మానం చేసినట్లయింది..." ఆమె ఉపన్యాసం కొనసాగించింది.

అందరూ చప్పట్లు కొట్టారు.

భీమిలి యువకుల బృందం వారితో శృతి కలిపారు.



సెల్లు కబుర్లా... సొల్లు కబుర్లా?

పి. జ్యోతి

నా ఫ్రెండ్ దేవి తెలుసుగా మీకు, అదేనండీ కాస్త ఎర్రగా బుర్రగా ఉంటుంది, అలా ఉంటానని దానిక్కాస్త పొగరుకూడా. మొన్నోరోజు మనం 'సునీతా" సూపర్ మార్కెట్‌లో సున్నిపిండి కొంటానికి వెళ్ళినపుడు అది కూడా 'పోలో' పాపిన్స్ కొంటానికొచ్చింది. అదెప్పుడూ అవి నవులుతా ఉంటుందిలేండి. మీరు వేసిన చిన్న జోక్‌కే పేద్దగా నవ్వింది, ఇప్పుడేకాదు చిన్నప్పటి నుంచీ అంతే... నేనూ అదీ మూడో క్లాస్‌లో మంచి ఫ్రెండ్స్ అని మీతో అప్పుడు చెప్పాను కూడా. ఈ మధ్యే వాళ్ళాయనకు ట్రాన్స్‌ఫర్ అయి ఇక్కడకు వచ్చారు అనికూడా చెప్పానూ..."

"అబ్బా! గుర్తొచ్చిందిలేవే బాబూ, ఇంతకూ విషయం ఏమిటో కాస్త చెబుతావా" అన్నారు చిరాగ్గా.

"హమ్మయ్య గుర్తొచ్చిందికదా! అయితే మీకసలు విషయం చెబుతా వినండి. మన బంటీగాడు క్యాడ్‌బరీ చాక్‌లేట్ కావాలనీ మారాం చేస్తే కారేసుకుని మరీ "కన్నాంబ పాన్ షాప్" ప్రక్కన ఉన్న "కంతిరీ చాక్‌లేట్స్ స్లెంటర్"లో చాక్‌లేట్స్ కొనడానికి వెళ్ళినపుడు నేను చెప్పిన దేవి కూడా అక్కడికి వచ్చింది. దాని మూడేళ్ళ కూతురు పింకీ ఛాయిస్ చాక్‌లేట్ కోసం తెగ ఏడ్చి ఛస్తూంటే వచ్చానంది లేండి. నేను చూడాలని కాబోలు దాని హాండ్ బాగ్‌లో నుండీ "సెల్" తీసి యమాఫోజు కొట్టుకుంటా, ఇంట్లో ఉన్న దాని కూతురు పింకీతో ఎలా మాట్లాడిందనుకుంటున్నారూ... మూతి తిప్పుతూ, కళ్ళు తిప్పుతూ "మున్నీ! చిన్నీ! నా బుజ్జికన్నా! ఇదిగో నీకోచం ఇప్పులే చాక్‌లేట్ సెంటర్‌కొచ్చా, మా చిత్తికదూ, అత్తా చూలకులా, నాకు నువ్వు సెల్‌లో కన్పిత్తున్నావ్, ఒద్దమ్మా! ఏల్వకే, ఇదిగో షాప్ అంకుల్‌కి డబ్బులిచ్చా, చాక్‌లేట్స్ ప్యాక్ చేసాడు. వత్తున్నానమ్మా, మా బంగాలుకొండ కదూ, కళ్ళు తులుచుకోవాలీ, ఫైవ్‌మినిట్స్‌లో నీ దగ్గలుంటా" అంటూ అదే చిన్న పిల్లలా మాట్లాడిందండీ.

ఇదంతా ఎందుకనుకున్నారూ, అదిసెల్‌లో మాట్లాడుతూంటే నేను చూడాలనీ. పేద్ద దానికి మాత్రమే సెల్ ఉందనీ వీరలెవెల్. అదేవనుకుంటోందసలు? నేనామాత్రం బోడిసెల్ కొనుక్కోలేననా దాని ఉద్దేశ్యం... ఏవిటంటారు మీరే చెప్పండి.

"అవునవును, నీకుమాత్రం ఏం తక్కువ, నీక్కూడా మన బంటీగాడున్నాడుగా, ఆవిడలా మూతితిప్పుకుంటూ, కళ్ళు తిప్పుకుంటూ ముద్దుముద్దుగా మాట్లాడటానికీ"

"భలే కరెక్టుగా చెప్పారండీ, అంతేకాదు, నా ఫ్రెండ్ 'కృష్ణవేణి' అనీ లేదూ... చాలా పొడవుగా ఉంటుంది లేండి. అదే మా ఫ్రెండ్స్ అందరిలోకీ పొడవుగా ఉంటాననీ గొప్పగా ఫీల్ అవుతుందండీ. నేనోసారీ నిద్దట్లో "కృష్ణా కృష్ణా" అని కలవరించా. అప్పుడు మీరు నన్ను నిద్ర లేపిమరీ ఎవడే ఆ కృష్ణా... వాడికీ నీకూ ఏవిటి సంబంధం అన్నారు. అదీ నా ఫ్రెండ్ కృష్ణవేణి అనీ, మేమంతా కృష్ణా అని పిలుస్తాం అనీ నేనంత చెప్పినా మీరసలు నమ్మలేదు. ఆ తెల్లవారే అదీ దాని భర్త రామూ మనకి ఫోన్‌చేసి మాట్లాడారు, వాళ్ళలా "రామకృష్ణుల్లా" మాట్లాడి నా కాపురం నిలబెట్టారు. లేదంటే నన్నిప్పటికీ మీరనుమానించే వారే..."

"అబ్బా! ఇంకా ఎప్పటిప్పటివో గుర్తు చేసుకుని మరీ చెబుతావేమోనని భయంగా ఉందే. ఇంతకీ నువ్వు చెప్పదలుచుకున్నదేవిటో చెప్పు త్వరగా"

"అదేనండీ మొన్న "సుందరీ" బ్యూటీ పార్లర్‌లో కనబడిందండి, నేనూ అప్పుడే వెళ్ళా. బ్యూటీషియన్ 'లలిత'... అది కూడా నాకు చాలా క్లోజ్ లేండి, నేనూ జుట్టు లెవెల్ చేయించుకుంటున్నా. అప్పుడే కృష్ణ కూడా అక్కడికొచ్చిందీ, వాళ్ళాయన ఆఫీసుకెళ్తూ దాన్నక్కడ డ్రాప్ చేసి వెళ్ళాడు. అది వచ్చి ఒక్క ఫైవ్ మినిట్స్ కూడా కాలేదు. ఇంతలోనే దాని పర్సులోనుండీ 'సెల్' తీసి, నేను చూడాలని కాబోలు వాళ్ళాయనతో "ఏవండీ ఆఫీసుకు చేరుకున్నారా, అయ్యో ఇంకా లేదా, లంచ్ బాక్స్‌లో అన్నం పెట్టానో లేదో నాక్కాస్త డౌట్‌గా ఉంది. ఒకసారి చూసుకోండీ. చూసుకున్నారా ఇంకా... వాటర్ బాటిల్‌లో వాటర్ పోసానో లేదో చెక్ చేసుకోండి. ఆ... ఉన్నాయా... అయితే ఒకే. అయ్యో అదేవిటండీ తుమ్ముతున్నారూ వెళ్ళేప్పుడు బానే వున్నారే... టూ మినిట్స్‌లోనే జలుబు ఎలా చేసిందండీ? నాకు తెగ బాధగా వుందండీ. వెంటనే మిమ్మల్ని చూడాలని వుందండీ. మీ దగ్గరకొచ్చేస్తున్నా... రమ్మంటారా..." అంటూ దానిసెల్‌లో ఓ వగలు పోతోందండీ. ఇదంతా ఎందుకనుకుంటున్నారూ. నేను చూడాలనీ... నాకు సెల్ లేదనీ, అసలు నేనామాత్రం కొనుక్కోలేననా, అందుకే వెంటనే పదండీ నేనీలోపే వెళ్ళి కేవలం నాకోసం పర్సనల్‌గా సెల్ కొనుక్కుంటానండీ" అన్నా వీరావేశంతో.

''లేడికి లేచిందే పరుగన్నట్టా ఏవిటాతొందర, నీ ఫ్రెండ్స్‌కుందనీ వాళ్ళతో మాట్లాడ్డానికే సెల్‌కొనుక్కుంటాననడం ఏం బాగోలేదే'' నసుగుతున్నారు.

"ఏవిటీ నసుగుతున్నారూ, మరి నా ఫ్రెండ్స్ అందరికీ వుంది. నాకు మాత్రం లేకపోతే ఎంత అవమానంగా ఉంటుందో మీకేం తెలుసు, ఇంకా మీకో విషయం చెప్పాలి, మా ఫ్రెండ్స్ అందరం ఈ మధ్య ఒకరింటికొకరం వెళ్ళితే టైమ్ వేస్ట్. పైగా తిరగడానికీ డబ్బుఖర్చనీ సెల్‌ఫోన్స్‌లోనే మాట్లాడుకుంటున్నాం, లాండ్‌ఫోన్‌కన్నా ఖర్చు తక్కువ. గ్రూప్ ఫోన్స్ తీసుకుంటే గంటలకొద్దీ మాట్లాడుకోవచ్చనీ, అందరం "సెల్‌కబుర్లు" చెప్పుకుంటున్నాం. మరినాకూ వుండాలిగా''

"ఏం కబుర్లు చెప్పుకుంటున్నారూ. సెల్లుకబుర్లా, నాకింకోలా వినబడిందిలే. చెబితే నువ్వూరుకోవుగానీ... పద వెళ్దాం సెల్లు కొనుక్కుందువుగానీ"

"నిజంగానా! ఉండండయితే మా దేవిదీ, కృష్ణదీ... అందరి నెంబర్లు తీసుకుని వస్తా. అక్కడ సెల్‌కొనగానే వీళ్ళందరికీ వెంటనే ఫోన్‌చేసి నా నెంబర్ చెప్పేస్తా, మరినేనూ "సెల్ కొన్నానోచ్" అనందరికీ తెలియజేయాలి మరి!

గొర్రె బలుత్తె గొల్లకు లాభం

కాలువ మల్లయ్య

"ఏం ది...? ముచ్చట్లేమొ జోరుదారుగ నడుత్తున్నయి... దేన్ని గురించి మాట్లాడ్తంర్రు...? ఎంతయిన నరంలేని నాలికె గద... ఎటువడితె అటే తిరుగుతది... ముడ్డినాది గాకుంటె పట్నందాక దేకుమన్నట్టు ఏదైన మాట్లాడచ్చు... ఏదైన కాదనవచ్చు. బాతఖాన్లకేంది మస్తు కొట్టచ్చు... గబ్బు నోర్లుగద ఎవ్వలనైన తిట్టచ్చు... ఏదైన చెయ్యచ్చు... మొండోని ముందు అందరు బలాదూరే... ఏమంటవోయ్ ఆనందం... మింగమెతుకు లేకున్నా మీసాలకు సంపెంగ నూనె అన్నట్టు ప్రభుత్వం, ప్రైవేటు అన్ని విషయాల గురించి ఏందో తెల్సినట్టు మాట్లాడవడ్తిరి... మాట్లాడు... మాట్లాడు" అన్నడు లింగరెడ్డి.

"లింగరెడ్డి లింగరెడ్డి నీపేరు లంగరెడ్డన్నట్టు చెయ్యవడ్తివి... నీకే సామెతలస్తయని ఓటిమీదోటి ఉతుకవడ్తివి. ఉతికారెయ్యవడ్తివి. గిది ప్రజాస్వామ్యం... గీ ప్రజాస్వామ్యంల మనకు మాట్లాడే హక్కుందా...? లేదా? ప్రైవేటును మంచిది గాదంటె గదేదో పెద్ద తప్పయినట్టు మా దండిగ రంధి పడవడ్తివి... గా ఆనందం మీదికి గంతగనం ఎగిరెగిరి పడ్తున్నవేంది...? గా ఆనందమేమన్నడని ప్రభుత్వ సంస్థలసలే ఉండద్దు. అంత ప్రైవేటయితేనే మంచిదంటవా ఏంది...?" అన్నడు శర్మ...

"మీరేం మాట్లాడ్తంర్రో నాకయితె ఒక్కముక్క గూడ అరుతం గాలేదు. ఒగలనొగలు ఏక్కునుడే కని అసలు సంగతేందో చెప్పుత లేకపోతిరి. నాది కొంచెమంత ట్యూబ్‌లైట్ మెదడు గద...! కొద్ది సూటిగ మాట్లాడలేరు..." అన్నడు ప్రభాకర్.

"చెట్టుకింది ముచ్చట్లంటే గివ్వేమరి... గా ఆనందమేమొ ప్రైవేటు మంచిది గాదంటున్నడు... గీ లింగరెడ్డికేమొ ప్రైవేటంటెనే ఇష్టం. ఎందుకంటె గీనె మన పాత ముఖ్యమంత్రిసారు దోవ పట్టి నడిసిండుగదా! ఆనందమేమొ ప్రైవేటు దెబ్బతోని నౌకరి పొగొట్టుకున్నడు..."

"అన్ని ప్రభుత్వం చేతల్నే ఉండాలె... ఉద్యోగులెవ్వలు పనిజెయ్యద్దు. ఉత్తగనే జీతాలు తీసుకోవాలె... గివ్వేగద మీరు కోరుకునేది...? గవర్నమెంటు ఆఫీసులల్ల ఎవ్వలు పనిజేత్తంర్రు...?"

"మా చెప్పినవు తియ్యవోయ్ లింగరెడ్డి... పనెగవెట్టెటోల్లు అంతటుంటరు... చెయ్యనోల్లమీద చర్యదీసుకోవాలె... ఎలుకలున్నయని ఇండ్లు కాలవెట్టుకుంటవా చెప్పు... ప్రైవేటంటె అమానుషమన్నట్టే... గండ్ల వ్యక్తిగత లాభాలుంటయి. గవర్నమెంటంటె ప్రజలదన్నట్టు... గిండ్ల ప్రజల బాగోగులుంటయి... ఎంత చెడ్డా ప్రజలు ప్రజలను పరిపాలించుకునే వ్యవస్థకదా ఇది...! ప్రైవేటంటె అందర్నికొట్టి కొందరికి పెట్టుడన్నట్టు... ప్రైవేటు సంస్థలోల్లు కోట్లకొద్ది సంపాయించుకుంటరు నిజమే... గా లాభలెట్లత్తన్నయి...? వేలాదిమందికి తక్కువ జీతాలిచ్చి ఎక్కువ లాభాలు పొందుడుతోని. ఆండ్ల మంచిగ జీతాలిచ్చేది ఎంతమందికి...? కొందరికే. గిట్ల గాల్లు కోట్లు సంపాయించుకుంటెగా డబ్బంత నల్లధనమయిపోతది గద... అదే ఈ డబ్బంత గవర్నమెంటు దగ్గరుంటె అండ్ల చాలావరకు ప్రజలకుపయోగపడ్తది గద...! అందుకే ప్రజలను ప్రేమించెటోల్లెవ్వరు గూడ ప్రైవేటును సమర్థించరు. మెడమీద తలుకాయన్నోల్లెవ్వలైన ప్రజాస్వామ్యంల ప్రయివేటును ఒప్పుకోరు..."

"అంటె లింగరెడ్డి మెడమీద తలుకాయ లేదంటవా ఆనందం...!"

"ఏదో సబగతి మాటకంటి... గట్లెందుకంట నేను..."

"ప్రైవేట్ల ఇంత పొడుగు నష్టాలుంటయనవడ్తివి... వాళ్ళు వేలకొద్ది జీతాలిస్తలేరా..." అన్నడు లింగరెడ్డి.

"ఎవ్వలకిత్తున్నరు...? ఎంతమందికిత్తున్నరు...? నలుగురైదుగురికి యాభై వేలిచ్చి, వెయ్యిమందికి మూడునాలుగువేలిత్తె బాగ జీతాలిచ్చినట్టా...? జీతాల్లో తేడాలు ఇరవై, ముప్పై రెట్లుంటేమన్నట్టు...? గిట్ల జేసుడుతోని కొందరు కోటీశ్వరులవుడు, చాలామంది కిందికే పోవుడు జరుగుదా... వ్యక్తిగత ఆస్తులు కొందరికే బాగా పెరిగి సమాజంలో అంతరాలు మరింత పెరుగుతయి. గిండ్ల గిన్ని తిప్పలుంటె అదేదో గొప్పదన్నట్టు మాట్లాడవడ్తివి... గవర్నమెంట్ సెక్టార్లు నడుత్త లెవ్వనుడు మోనం... మొన్నట్రాక ఎంత బాగ నడ్సినయ్. ఇప్పుడు గూడ ఎన్ని నడుత్తలెవ్వు. ప్రైవేటును బొట్టుపెట్టి పిలిసి వాట్ని రోగగ్రస్థం సేసిం దెవ్వలు...? సరే... ఏదన్న రోగమస్తె మందులు వాడతమా...? చంపి పారేత్తమా..."

"అమెరికా ప్రైవేటుతోని పైకి రాలేదా..."

"మనకు తెలిసీ తెలువని ఒక్క ఉదాహరణ తీసుకొని గదే మొత్తమనుకుంటెట్ల... ప్రపంచమంటె ఒక్క అమెరికాయేనా... మరి పైకచ్చిన యూరోపియన్ దేశాలల్ల ఉన్నవి ప్రభుత్వ వ్యవస్థలు కావా...? చైనాలో ఉన్నదేంది... చైనాలో ప్రభుత్వ వ్యవస్థ బలంగా ఉండటంతోనే కద ప్రపంచాన్ని శాసించగలుగుతుంది. గివ్వన్నిడ్సి పెట్టి అమెరికా అమెరికా అని అంటెయిపోతదా? దేశ పరిస్థితులను సూడాలె గద..."

"చైనాల ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానిస్తలేరా...?"

"ఏ దేశంలనయిన ఏ సమయంలనయిన ఏదో మేరకు కొన్నిటిని ప్రైవేటు కప్పగించుడు ఎక్కన్నయిన ఎప్పుడయిన ఉంటది. అది అవసరంకూడ... కాని మొత్తానికి మొత్తాన్ని ప్రైవేటుకు అప్పజెప్పి చేతులు దులుపుకుంటమనుడు తప్పించుకునుడే అయితది... బాధ్యతా రాహిత్యమే ఐతది. తాగే నీళ్ళు, తినే బువ్వ కాన్నుంచి అన్నిట్ని ప్రైవేటోల్లకు అప్పజెప్పుతాంటె విపరీతంగ ధరలు పెరుగవా మరి! నీళ్ళను కూడ రొంర్రూపాయలకు చారెడు కొనుక్కునుడు ప్రైవేటు మాయేకద... పోటీని పెంచుడు... ఒగల్నొగలు తొక్కుకునుడు... చాట్ల తవుడు పోసి కుక్కలకు కొట్లాట పెట్టుడే ప్రైవేటంటె. అన్నిట్లో పోటీ ఎందుకట...? పోటీ అంటెనే అమానుషత్వం...!"

"దేంట్లన్న తిప్పలు దాంట్లున్నయి తమ్మి..."

"గట్లని తప్పించుకుంటేమన్నట్టు...? ప్రైవేటు స్తోమత ఎంతమందికుంది? వేలు, లక్షల ఫీజులు అంత డబ్బుపెట్టి చదివే స్తోమత ఎంత మందికుంది... ఇవి లేనప్పుడు వెళ్ళిన విద్యావంతుల కంటె గొప్పోల్లస్తున్నారా ఇప్పుడు...? ఈ లక్షలు వేలెవ్వలకు పోతున్నయి...? ఇటు చెప్పిటోల్లు, అటు చదివెటోల్లు పొందేదేమన్న ఉందా...? వీళ్ళందర్ని దోచి కొందరికి పెట్టినట్టే కదా..."

"ప్రైవేటు బళ్ళల్ల చదువు మంచిగుంటలేదా..."

"ఓ వ్యక్తిని చంపాలంటె చెడ్డవాడని ముద్రవేసి ప్రచారం చేసినట్టే ఉంది ఎవ్వారం...? గవర్నమెంటు యూనివర్సిటీలు, ఇంజనీరింగ్ కాలేజీలు, మెడికల్ కాలేజీలల్ల చదువు బాగలేదా...? మరి బల్లకేమచ్చింది...? ప్రైవేటును ప్రోత్సహించటానికే గివ్వన్ని చేసింర్రు... ఎంతయిన ప్రైవేటంటె ప్రజలమీద వేటన్నట్టే... ఏమంటవే రాజమల్లన్న..."

"జోరుగ చెప్పినవోయి ఆనందం... గిప్పుడున్న దేంది... ప్రజాస్వామిక ప్రభుత్వాలు.అంటేందన్నట్టు...? కొందరి బాగోగులు సూసుడు కంటె ప్రజలందరి బాగోగులు సూడాలన్నట్టుగద... ఏవో కొన్ని లోపాలుంటె ఉండచ్చుకని ప్రైవేటుకంటె ప్రభుత్వ వ్యవస్థే ఎక్కువమంది ప్రజలకు లాభం చేకూర్చుతది. గా లోపాలను సరిజేసుకుంటె మంచిది. ప్రైవేటంటె వ్యక్తిగత ఆస్తులు పెంచుడు. అంతరాలు పెంచుడు. గవర్నమెంటంటె ప్రజలు బలపడుడు. కొందరి దగ్గర్నే బాగ డబ్బుంటె వచ్చేదేంటి... వాళ్ళకే లాభం. గవర్నమెంటు దగ్గర బాగ డబ్బుంటె అది ఏదో విధంగ ప్రజలకుపయోగపడ్తది. గవర్నమెంటు బలంగుంటె ప్రజలు బలంగున్నట్టే కద...

. గొర్రె బలుస్తే గొల్లోనికి లాభమా కాదా...? గిది గంతే... ప్రైవేటును ప్రోత్సహించుడంటె ప్రజలను వ్యతిరేకించుడే..." అన్నడు రాజమల్లు...

జ్ఞాపకశక్తి

డాక్టర్ ఎన్. ఉమాజ్యోతి,
ఎం.డి., (సైక్రియాట్రిస్ట్)

జ్ఞాపకశక్తి తగ్గిపోయింది, ఏమైనా మందులుంటే ఇవ్వండి అని తరచుగా చాలామంది వస్తుంటారు. వీరిలో విద్యార్థులే అధికశాతం. జ్ఞాపకశక్తి తగ్గిపోవడం వల్లనే తాము మంచి మార్కులు లేదా ర్యాంకులు తెచ్చుకోలేక పోయామనే సాకు చూపిస్తారు. నిజానికి జ్ఞాపకశక్తి తగ్గిపోవడం అనే జబ్బు చిన్న వయస్సులో రాదు. మనిషి తనకున్న జ్ఞాపకశక్తిలో పదిశాతం కన్నా తక్కువే ఉపయోగించుకుంటున్నాడు. అదే పూర్తిగా ఉపయోగించుకోగల్గితే అద్భుతాలు సృష్టించవచ్చు.

జ్ఞాపకశక్తి మూడు రకాలు. ఇమ్మీడియేట్ మెమొరి, రీసెంట్ మెమొరి, రిమోట్ మెమొరి. ఇమ్మీడియేట్ మెమొరి అంటే ఇప్పుడే జరిగిన విషయాలు గుర్తుంచుకోవడం. ఉదా: ఏదో చెపుదామని అనుకొని పక్కగదిలోకి వెళ్ళేసరికి మరిచిపోతారు, టీచర్ పాఠం చెపుతూ మధ్యలో అడిగే ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోవడం. దానికి ముఖ్య కారణం విషయం మీద మనసు నిలపకపోవడమే. బాడీ ప్రెజంట్ మైండ్ ఆబ్‌సెంట్ అన్నమాట. పాఠం మీద కాన్‌సెన్‌ట్రేట్ చేయకుండా ఊహాలోకంలో విహరించడం జరిగితే ఇమ్మీడియేట్ మెమొరీలో ప్రాబ్లెమ్ వచ్చినట్టే.

రెండవది రీసెంట్ మెమొరి అనగా గత 1-2 రోజుల్లో జరిగిన విషయాలు గుర్తుపెట్టుకోవడం. రిమోట్ మెమొరి అనగా కొన్ని నెలలు, సంవత్సరాల క్రిందటి విషయాలు గుర్తుంచుకోవడం.

మెమొరి అనేది మూడు దశల్లో మెదడులో నిక్షిప్తమవుతుంది. 1. రిజిస్ట్రేషన్ 2. రిటెన్షన్ 3. రీకాల్. ఏ విషయాన్నైనా విన్నా, చదివినా మెదడు రిసీవ్ చేసుకోవడాన్ని రిజిస్ట్రేషన్ అంటారు. ఇందుకు చేసే పని మీద ఆసక్తి, ఏకాగ్రత ముఖ్యం. మనం చూసిన సినిమాను ఎంత కాలానికైనా చెప్పగలం కాని ఇప్పుడే టీచరు చెప్పిన లెక్కని కొంచెం సేపటిలో మరిచిపోతాం. దీనికి కారణం లెక్కల మీద ఇష్టం లేకపోవడమే. అందుకే గంటల తరబడి చదివినా ఒక్క ముక్క కూడా గుర్తుకు రాదు. ఇక మెదడులో రిజిస్టర్ అయిన విషయాలు కొంతకాలం అలాగే గుర్తుండిపోవడాన్ని రిటెన్షన్ అంటారు. విద్యార్థికి ఇది చాలా అవసరం. ఏకాగ్రతతో చదవకపోతే ఆ సబ్జెక్ట్ రిజిస్టర్ అవదు. రిటెన్షన్ అనేది జరగదు. క్లాసురూంలో చెప్పేటప్పుడు వినకుండా ఏదో ఆలోచిస్తూ తరువాత చదివేటప్పుడు అర్థంగాక టెన్షన్ పడుతూ ఉంటే అసలు చదివేది బుర్రకెక్కదు. ఆ తరువాత మార్కులు రాక ఏడుస్తూ కూర్చోవాలి. దానికంటే టీచర్ చెప్పేది శ్రద్ధగా విని ఇంటికి వచ్చాక ఒక్కసారి చదివి అర్థం కాని పాయింట్లు రాసుకుని మరుసటి రోజు టీచర్ నడిగి తెలుసుకోవాలి. ఇలా చేసే వారికి పరీక్షల ముందు రాత్రంతా టీలు తాగి, మేల్కొని చదవటం, టెన్షన్ పడటం పాసవక పోవడం అనేది జరుగదు. ఎన్ని గంటలు చదివాము అన్నది ముఖ్యం కాదు ఎంత ఏకాగ్రతలో చదివామనేది ముఖ్యం. ఏ పనైనా సక్సెస్‌ఫుల్‌గా చేయాలనుకుంటే ఆసక్తి ఉండితీరాలి. శరీరానికి వ్యాయామం ఎంత



అవసరమో మెదడుకు కూడా అంతే అవసరం. మెదడుకు శిక్షణ ఇవ్వాలంటే నిరాశ నిస్పృహలను, నిరాసక్తతను దూరం చేసుకోవాలి. మెదడుకు వ్యాయామం అంటే పజిల్స్ పూర్తి చేయడం, పేపర్ చదివాక అందులో హెడ్‌లైన్స్ అన్నీ కళ్ళు మూసుకుని గుర్తుకు తెచ్చుకోవటం, కళ్ళు మూసుకుని మన ఇంటిలో కాని, బాగా తెలిసిన ఇంటిలో కాని ఏఏ వస్తువులు ఎక్కడ ఉన్నాయో, ప్రయాణంలో ఏఏ స్టేషన్లు దాటామో గుర్తు పెట్టుకోవడం ఇంకా ఎన్నో మెమొరీ గేమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. చేయవలసిన పనులను సినిమా రీళ్ళలా కళ్ళముందు ఊహించుకుని పని మొదలు పెట్టండి. ఇక మరచి పోవడం అనేది జరగదు. ఒక వ్యక్తి పేరు, అతని అలవాట్లు, ఎత్తు, రంగు, వృత్తి, మొదలగు వాటితో లింకు పెట్టుకుని గుర్తుపెట్టుకోవాలి.

అతి ముఖ్యమైంది పాజిటివ్ థింకింగ్. నేను కష్టపడితే అనుకున్నది సాధించగలను అనే ఆలోచన మనసులో స్థిరంగా ఉంచుకోవాలి. మీ మనసు ఎంత ప్రశాంతంగా ఉంటే మీ జ్ఞాపకశక్తి అంత సునిశితంగా తయారవుతుంది.

సమాజంలో మన చుట్టూ ఉన్న గొప్ప వ్యక్తుల్ని బాగా గమనించాలి. వారిలో ఉన్న మంచి అలవాట్లను మనం అలవరచుకోవాలి. వీరిని ఆదర్శంగా తీసుకుని మీరు కూడా ఆస్థాయికి చేరుకోవడానికి ప్రయత్నం చేయాలి. కృషితో నాస్తి దుర్భిక్షం.



మీ గుండె భద్రతకు ఏడు సూత్రాలు

1. **పొగతాగటం మానేయండి:**

గుండెపోటు మరణాలలో 20శాతం పొగతాగే వారిలో వచ్చేవే. పొగతాగడం మానేసిన 15 ఏళ్ళ తరువాత రిస్క్ జీరో శాతానికి వెళుతుంది.

2. పరిమిత, సమతుల్య ఆహారం తీసుకోండి:-

✓ కూరగాయలు ఎక్కువ తినండి.

✓ చేపలు, మొలకెత్తిన విత్తనాలు ఎక్కువ తినండి.

✓ నూనె, నెయ్యి తక్కువ తీసుకోండి.

✓ కొవ్వు, పెరిగే పదార్థాలు తీసుకుంటే రక్తనాళాలు మూసుకుపోయి గుండెపోటు శాతాన్ని 20కి పెంచుతాయి.

3. **ఉప్పు తగ్గించండి**

ఉప్పు ఉండే పదార్థాలను వయస్సు పెరిగే కొద్దీ తగ్గించుకోండి. ఉప్పు రక్తపోటును పెంచుతుంది. రక్తపోటు గుండెపోటును తెస్తుంది. క్రమం తప్పకుండా బి.పి. చూపించుకోవాలి.

4. **వ్యాయామం**

ఎవరైతే క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తారో వారిలో గుండెపోటు తక్కువగా వస్తుంది. కనీసం రోజుకు 3 సార్లు 10 నిమిషాలు చొప్పున చెమట పట్టే వ్యాయామం, ఏదో ఒక వ్యాయామం చేస్తే గుండెపోటు వచ్చే అవకాశం 40 శాతం తగ్గిపోతుంది.

5. **మానసిక ఆందోళన తగ్గించుకోండి:**

ఉద్యోగరీత్యా వచ్చే మానసిక వత్తిడి వల్లే అధిక శాతం



గుండెపోట్లు నమోదు అవుతాయి. దీనికి ఒక్కటే మార్గం అది స్ట్రెస్ రిలాక్సేషన్. ఇది యోగ, ధ్యానం (మెడిటేషన్) వల్లే సాధ్యమవుతుంది. ప్రయత్నించి చూడండి.

6. **క్రమం తప్పకుండా ఆరోగ్య తనిఖీలు**

ఇది అందరికీ వర్తించే ఆరోగ్య సూత్రం. ముఖ్యంగా మీ దగ్గర రక్త సంబంధపు బంధువు గుండెపోటుతో 60 ఏళ్ళకు ముందే మరణించినట్లయితే మీరు రిస్క్ గ్రూపులో ఉన్నట్లే. కాబట్టి ప్రతి సంవత్సరం చెకప్ చేయించుకోవాలి. 40 ఏళ్ళు దాటిన ప్రతివారూ ఏటా మెడికల్ చెకప్ చేయించుకోవాలి.

7. **మీ పిల్లలను రక్షించుకోండి**

గుండె రక్తకణాలు మూసుకొని పోవడానికి 20 ఏళ్ళు పడుతుంది. కాబట్టి మీరు తల్లిదండ్రులుగా మీ పిల్లల ఆరోగ్యం కోసం చిన్నప్పటి నుంచే వారికి ఆరోగ్య నియమాలు (తక్కువ కొవ్వు పదార్థాలు పెట్టాలి, జంక్ ఫుడ్ తగ్గించాలి) చెప్పాలి. వ్యాయామం చేయించాలి. టీవీ దగ్గర కూర్చోని తిండి తింటూవుంటే రిస్క్ ఎక్కువ అవుతుంది. వారి శరీరం బరువు పెరగకుండా ఫిట్‌నెస్ వ్యాయామాలు అలవడేలా చూడాలి.

దంత సంరక్షణ

క్విజ్-11

నిర్వహణ:
డా॥ కె.ఎల్.వి. ప్రసాద్,
హన్మకొండ

1. నోటి దుర్వాసన'కు, పిప్పిపన్ను వ్యాధి కూడా కారణమే!
   అ) అవును
   ఆ) కాదు
   ఇ) కావచ్చు
   ఈ) కాకపోవచ్చు
2. 'పిప్పిపన్ను వ్యాధి' వుండి, పన్ను బాగా కదులుతున్నట్లయితే
   అ) మందులతో గట్టి పడేటట్లు చూసుకోవాలి.
   ఆ) ఫిల్లింగులు తీయించుకోవాలి.
   ఇ) శస్త్రచికిత్సతో పన్ను గట్టి పడేలా చూసుకోవాలి
   ఈ) వెంటనే పన్ను తీయించుకోవాలి.
3. అంటుకునే గుణం కలిగిన ఆహార పదార్థాలు
   అ) 'పిప్పిపన్ను వ్యాధి' రాకుండా చేస్తాయి
   ఆ) 'పిప్పిపన్ను వ్యాధి'ని కలిగిస్తాయి.
   ఇ) పంటి సంరక్షణకు ఉపయోగిస్తాయి
   ఈ) నోటి దుర్వాసన కలిగిస్తాయి
4. పిప్పిపన్ను వ్యాధి
   అ) అంటువ్యాధి
   ఆ) అనువంశిక వ్యాధి
   ఇ) ధనవంతుల వ్యాధి
   ఈ) అంటువ్యాధికాదు
5. 'పిప్పిపన్ను'కు ఫిల్లింగ్ ఎప్పుడు అనుకూలం?
   అ) 'పిప్పి' పింగాణిమీద స్థాయిలో ఉన్నప్పుడు
   ఆ) 'పిప్పి' డెంటిన్ స్థాయిలో ఉన్నప్పుడు
   ఇ) 'పిప్పి' పల్ప్‌కుహరం చేరనంతవరకు
   ఈ) పై మూడూ కరక్ట్
6. 'పిప్పిపన్ను వ్యాధి'కి అంతిమ చికిత్సా విధానం.
   అ) ఫిల్లింగు చేయడం
   ఆ) మూల చికిత్స చేయడం
   ఇ) దవడ చికిత్స చేయడం
   ఈ) పన్ను తీసివేయడం
7. పన్ను తీయించుకోవడానికి అనుకూల పరిస్థితులు
   అ) గుండె సంబంధిత, రక్త సంబంధ వ్యాధులు లేకపోవడం
   ఆ) మధుమేహవ్యాధి లేకుండా వుండడం
   ఇ) రక్తలేమి లేకపోవడం
   ఈ) పైవన్నీ అవసరమే
8. తాగేనీటిలో అధికశాతం 'ఫ్లోరైడ్లు' వుంటే
   అ) పిప్పిపన్ను వ్యాధివస్తుంది.
   ఆ) ఫ్లోరోసిస్ వ్యాధి వస్తుంది
   ఇ) చిగురు వ్యాధి వస్తుంది
   ఈ) దవడవాపు వస్తుంది
9. తాగేనీటిలో అవసరానికి తక్కువగా ఫ్లోరైడ్లు వుంటే
   అ) ఫ్లోరోసిస్ వస్తుంది
   ఆ) పిప్పిపన్ను వస్తుంది
   ఇ)చిగురు వాస్తుంది
   ఈ) దవడ వాపువస్తుంది
10. పంటిపై 'ఫ్లోరోసిస్' యీ విధంగా కన్పిస్తుంది
   అ) తెల్లని సుద్దమచ్చలు
   అ) నల్లని మచ్చలు
   ఇ)ఎర్రని మచ్చలు
   ఈ) పచ్చని మచ్చలు

జవాబులు:
1) అ 2) ఈ 3) 'అ' ఈ 4) ఈ 5) ఈ
6) ఈ 7) ఈ 8) అ 9) అ 10) అ

అక్షర తంత్రులు

సినారె డైరీలో పోయెమ్ రాయని రోజంటూ వుండదని అంటారు. ఆవేదన, ఆలోచన, చైతన్యం, తపన, శాంతి, అశాంతి, ఆరాటం, సుఖం, సౌఖ్యం, స్వేచ్ఛ, మానవీయతా, ప్రేమ, జాలి, స్వచ్ఛత, సత్యశీలతా వంటి అంశాల చుట్టూ సినారె కవిత్వం పరిభ్రమిస్తుంది. ఇవ్వాళ మనిషిని కలుషితం చేసేవీ ఇవే. వీటికి కారణాలైన మూలాల్లోకి కవి వెళ్ళకుండా మార్మికంగా పాఠకుల మెదళ్ళకి వదిలేసారు. ఇది యాదృచ్ఛికం కాదు. అనుభవాల పుటల్లోంచి మలుచుకున్న రహదారి. నిరంతరం నిర్మలంగా జాలువారే నిలువెత్తు కవితా సంతకం సినారెకి ఇదేం కొత్తకాదు.

మనం రోజూ చూసే అద్దంలో కవులు తాము ప్రతిబింబాన్ని చూసుకుని రకరకాలుగా వర్ణించిన సందర్భాలున్నాయి. కానీ సినారె చిత్రించిన అద్దంలోని ప్రతిబింబం అందరిలా వుండదు. అదే సినారే కవితా వైచిత్రి. ***అద్దమా ఓ అద్దమా! దయతో నా అంతరంగాన్ని ముద్రించి చూపు! ఏయే పొరల్లో ఏ చీకటి మరకలున్నాయో/ పొద్దున్నే లేచి చూసుకుంటాను/స్నానం చేసేటప్పుడు/నా అవయవాలతోపాటు/ అంతరంగాన్ని ప్రక్షాళన చేసుకుంటాను*** అని ధైర్యంగా మొహమాటంలేని నిండైన మూర్తిమత్వంలోంచి వచ్చినమాట. తప్పులు చేయటం మానవ సహజం వాటిని దిద్దుకోవటం మహనీయుల కర్తవ్యం ముదావహం.

అరమోడ్పు కన్నులతో ఆశగా మన వైపే ఆశగా ఎదురుచూస్తున్న "శవాక్రందన" పోయెమ్‌ను పరామర్శిస్తే శవయాత్రలోని రణగొణధ్వనుల్ని సున్నితంగా తిరస్కరిస్తూ సంస్కరించిన సినారెకి జేజేలు. అని అంటారు. అయినా పట్టించుకున్న దాఖలాల్లేవు. లోకం ఎప్పుడో బధిరుల పాఠశాలై పోయింది. ఆకలి రాజ్యం సినిమాలో "చావు కూడా పెళ్ళిలాంటిదే బ్రదర్" వాక్యం సజీవంగానే సాగిపోతోంది. విచారకరం.

మనిషి ప్రాణమున్న మట్టిపిండం. ఎగిరేపక్షుల మీద ఈర్ష్య పడటంకన్నా చేతుల్ని గురుతులుగా విప్పుకుని అంబరం అంచుల్ని అందుకోవచ్చుంటారు. అందుకు మనిషికి సంకల్పబలం కావాలి. అది అమరితే ***"కొండలు దిండ్లుగా మారి/ తలకిందికి రావా/ సెలయేళ్ళు సిల్కు కండువాలై/ భుజాలను చేరుకోవా/ విశ్వం అరచేతిలో వాలదా/ కాలం ఇంటి కాపలాకాయదా"*** అంటారు. ఎంత గొప్ప భావ చిత్రమిది. కవిత్వంలో అసాధ్యాలను సుసాధ్యం చేయడమంటే ఇదేమరి.



జ్వాలాగా జీవించాలని
సి.నా.రె. కవితాసంకలనం
వెల: 100/-
ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాదు.
నవోదయ బుక్‌హౌస్ ఆర్యసమాజం ఎదురుగా కోఠీ, హైదరాబాదు.

సినారె భావచిత్రాలకి బందీకాని పాఠకులుండరు. అంతలోనే తేరుకుని అంత్యప్రాసల ఆహ్లాదంలో సేదదీరుతారు. సూక్ష్మాతి సూక్ష్మమైన అంశాన్ని చిత్రించటానికి పదుల సంఖ్యలో పద చిత్రాల్ని ఉదహరిస్తూపోతారు. అది వారి కవితా పరిపక్వతకి గీటురాయి. **"గాలి వీచినంత సులభంగా/ఫలితాలు ఒళ్ళో రాలిపడవు/కడుపు చిట్లితేగానీ/విత్తనం మొలకెత్తదు/ తూరుపుదిక్కుకు ప్రతి ఉదయం/ప్రసవవేదనే/తన ఒంటికి చిల్లులు పొడిచారని/ ఏడుస్తూ కూర్చోదు వెదురు/ ఊదే ఊపిరికి స్వరాలద్దీ/ తన ఉనికిని సార్థకం చేసుకుంటుంది".** మనిషీ అంతే. బతుకులోని ఒడిదుడుకులను దాటుకుంటూ సాగిపోవాల్సిందే అంటారు సినారె.

"ఆయుస్సు నిడివిని/ అంచనావేసే కాలజ్ఞానులెవరు/ అది ఏ క్షణంలో/దారం పుటుక్కున తెగిపోతుందో తెలియదు/ అందుకే ఉన్నన్నాళ్ళు ఉజ్వలంగా ఉండాలి/ ఉదయ సూర్యబింబాన్ని తురాయిలా తొడుక్కుని" ఇలాంటి ధైర్యాన్నిచ్చి వెన్నుతట్టే కవి సినారె. మనం చేయాల్సిందల్లా వజ్ర సంకల్పంతో ముందుకు నడుస్తూ జ్వాలాగా జీవించటం.

- పరమాత్మ

'పిల్లలకోసం తెలుగుసాహిత్య చరిత్ర'

ఆధునిక తెలుగు సాహిత్య రంగంలో కె.ఆర్.కె. మోహన్ అన్ని ప్రక్రియలనూ స్పృశిస్తూ తన రచనా వటిమలతో తన పేరును సుస్థిరపరుచుకున్నారు. చిన్న పిల్లల కథల నుండి సైన్స్ ఫిక్షన్ నవలల వరకు, కథా కవిత్వం నుండి సినీరంగ విశేషాల వరకు ఆయన ఎన్నో ఉపయుక్త పుస్తకాలు వెలువరిచారు.

ఎలక్ట్రానిక్ మీడియా విజృంభణతో తెలుగు పాఠకుల్ని కోల్పోతున్న ఈ విషమ పరిస్థితులలో కె.ఆర్.కె. మోహన్ 'పిల్లల కోసం తెలుగు సాహిత్య చరిత్ర'ను గ్రంథస్తం చేసి వెలువర్చటం సాహసమే. అయితే ఈ కాన్వెంట్ చదువుల కాలంలో తెలుగు భాషపట్ల, తెలుగుసాహిత్యంపట్ల అసలు అవగాహనే లేని ఈనాటి పిల్లలకు మన తెలుగు సాహిత్యాన్ని కాసింతైనా 'రుచి' చూపించ లేకపోతే మన సాహిత్య సంపదంతా ఎందుకూ పనికిరాని విధంగా, మన సాహిత్య సంస్కృతి పునాదులు క్రూకటి వేళ్ళతో సహా పెకిలించి వేయబడటం ఖాయం. అందుకే ఈ రచయిత తెలుగు భాషాభివృద్ధికి వివిధ పోరాట సమితిలతో కలిసి ఉద్యమిస్తూ 'పిల్లల కోసం తెలుగు సాహిత్య చరిత్ర'ని క్లుప్తంగా గ్రంధీకరిస్తూ మన తెలుగుజాతికి కానుకగా అందిస్తున్నారు.

మహాభారతంలో పొందుపర్చబడిన మన 'ఆంధ్రజాతి' ప్రశస్తిని మొదలుకొని 11-12 శతాబ్దాలకు చెందిన నన్నయ్య, తిక్కన కాలంనాటి కవుల విశేషాలతో పాటు, క్రీ.శ 1909 గురజాడ అప్పారావు కాలం వరకు తెలుగు సాహిత్యరంగాన్ని సుసంపన్నం చేసిన కవుల గురించి క్లుప్తంగా పరిచయం చేశారు. ఈ గ్రంథంలో పిల్లలకు తమ మామయ్య రాత్రిపూట కథల రూపంలో ధారావాహికంగా చెప్పేరీతిలో సాగిన ఈ గ్రంథం, పిల్లల పాత్రలే కాదు, అది వింటున్నట్టు (రచన సాగించిన) పెద్దల పాత్రలచేత కూడా కొన్ని ఉప ప్రశ్నలు వేయించి మన సందేహాలకు నివృత్తి పరుచుకొనే విధంగా ఆసక్తి కలిగించే రీతిలో మలిచిన తీరుకు రచయితను అభినందించాల్సిందే.

'సువర్ణాక్షరాలతో లిఖించ దగ్గది' అవేదాన్ని ఈ గ్రంథకర్త పిల్లలకు అర్థమయ్యే వీలుగా 'బంగారు అక్షరాలతో వ్రాయదగ్గది' అని అతి తేలికైన భాషలో రాయటంలో గమనార్హం. ఈ గ్రంథంలో కథ చెప్పే ప్రసాద్ మామయ్య పాత్రకు ఈ రచయితకు దగ్గర పోలికలు కనిపిస్తాయి. ఎందుచేతనంటే రచయితది బందరు కావటం, అందులో రచయితగా ఈయన అనేక అనుభవాలు గడించటం ఆయనే కథ చెప్తున్నట్లుంటుంది. ఈనాటి టీవి సీరియళ్ళ నిషాలో పడిపోతున్న ఈతరం వారికి (మన తెలుగు సాహిత్య చరిత్రను సీరియల్ కథగా చెపితే వినే పరిస్థితులు లేనప్పటికీ) ముందుగా మన పెద్దలు కూడా తెలుగుసాహిత్య చరిత్రను క్లుప్తంగానైనా అవగాహనపర్చుకోవాలి. తద్వారా పిల్లలకూ ఇటువంటి గ్రంథాలు చదివించే ప్రయత్నం చేస్తేగాని మన భాష యొక్క వారసత్వపు సంపద భావితరాలకు అందటం సాధపడదని గ్రహించాలి. ముఖ్యంగా ఈ గ్రంథం పోటీ పరీక్షలు రాసేవారికి, 'తెలుగు సాహిత్యం' ఐచ్ఛిక అంశంగా తీసుకునే విద్యార్థులకు ఎంతో ఉపకరిస్తుంది. తెలుగు సాహిత్యం పట్ల ఆలోచనను, అవగాహనను పెంపొందింపచేస్తుంది.

- చలపాక ప్రకాష్

పిల్లల కోసం 'తెలుగుసాహిత్య చరిత్ర'
రచన: కె.ఆర్.కె. మోహన్
పేజీలు: 77
వెల: రూ. 40/-
ప్రతులకు: రచయిత,
ప్లాట్ నెం:101, కంచి రెసిడెన్సీ,
11-19,
పి అండ్ టి కాలనీ,
దిల్‌సుఖ్‌నగర్,
హైదరాబాద్-500060.

స్వీకారం

రక్తాక్షరాలు
జూలియస్ ఫ్యూజిక్
కాట్రగడ్డ నరసయ్య
వెల: 30/-
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్,
1-1-187/1/2,
చిక్కడపల్లి, హైదరాబాదు.

రంగుల కల

పి. మురళీకృష్ణ

బస్సు అందుకోవాలన్న ఆత్రుతతో బస్టాండ్‌కు పరుగుతీస్తోంది గాయత్రి. ఓ భుజానికి వేలాడుతున్న బ్యాగ్, వాటర్ బ్యాగ్‌ను మోస్తున్న మరో భుజం. అద్దాల వెనుక నుండి బస్సును వెతుక్కోవడంలో బిజీగా ఉన్న కళ్లు. రోజూ స్కూలు విడిచిపెట్టిన తర్వాత ఆమె పరిస్థితి ఇదే. అయితే ఆమెకూ బోలెడు కలలున్నాయి. తను పనిచేస్తున్న స్కూలుకు ప్రిన్సిపాల్ కావాలని, తన పిల్లలను మాత్రం ఇంటర్నేషనల్ స్కూల్లో చదివించాలని, కొడుకు పెద్దయితే అర్జెంట్‌గా అమెరికా పంపించేయాలని, భర్తను కనీసం ఓ కార్పొరేషన్‌కు ఛైర్మన్‌గానైనా చూడాలని... ఇలాంటి కోరికలు చాలానే ఉన్నాయి. అత్తగారిని సగౌరవంగా అనాథాశ్రమానికి పంపాలని, ఇంటి మనుషులను పనిమనుషుల మాదిరిగా రాచిరంపాన పెట్టాలనే సగటు తెలుగు టివీ సీరియల్స్‌లో లేడీ విలన్ వేషాలూ ఆమెను ఆకట్టుకుంటూనే ఉంటాయి. అసలు ప్రతి విషయాన్నీ ఆర్థిక కోణంలో విశ్లేషించాలనే ఉబలాటం గాయత్రి సొంతం. ఇలాంటి అమాయక గాయత్రిలు మనకు చాలా మంది కనిపిస్తూనే ఉంటారు. జీవితానికి కమర్షియల్ కలర్ అద్దాలండీ అని తరచూ అంటుంటారు. కలలు కనమని కలాంజీనే చెబితే వాస్తవంలో బతకాలని కొందరు చాదస్తులు చెబుతారేంటండీ అని ఇలాంటి వాళ్లు నిలదీస్తుంటారు కూడా.

కలాం గారు చిన్న చిన్న కలలు కనడం నేరం అనీ అన్నారు. అందుకే మనం అల్ట్రా మోడ్రన్ కలలు కంటే తప్పేంటి అనే ముక్తాయింపూ ఇస్తుంటారు.

తమను జీవితాంతం కలలకే పరిమితం చేస్తూ తమ స్వప్నాలను పండించుకుంటున్న మేథోపరమైన దోపిడీదారుల చట్రంలో ఎందరో గాయత్రిలు విలవిలలాడుతున్నారు. కలలు కనడం తప్పని ఎవరూ అనరు. అయితే స్వార్థానికి కలల ముసుగు తొడగడం, ఇతరులపై స్వారీ చేస్తూ అభివృద్ధికి అర్రులుచాచడం కొంత అసహజంగా అనిపిస్తుంటుంది. ప్రపంచీకరణ పుణ్యమా అని ఇప్పుడు అన్నీ వ్యాపారమయమే. చివరికి కళలూ, కలలూ కార్పొరేట్ సామ్రాజ్యాధిపతుల ఊడిగం చేసే పనిముట్లయ్యాయి. సామాన్యుల కలల చుట్టూ స్వార్థపరుల వ్యాపార కాంక్ష అల్లుకుంటోంది. వారిని కలల్లో విహరింపచేస్తూ తమ మార్కెట్‌ను విస్తృతం చేసుకునే విష సంస్కృతి ప్రబలింది. ఫలానా పద్ధతులు పాటిస్తే మీ శరీరాకృతి మారుతుందని, మీ ఫిజిక్ బాగుంటే అది మీ అభివృద్ధికి సోపానమవుతుందని అంటూ అడుగడుగునా బాడీషాపులకు తెరలేస్తోంది. విజయాన్ని మార్కెట్ సరుకుగా మార్చి పీస్‌వర్క్‌లుగా విక్రయిస్తున్న ధోరణి తలెత్తింది. మిసైల్ లాంటి ఆత్మవిశ్వాసాన్ని మిస్‌కావద్దంటూ సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌ను కిలోల లెక్కన అమ్ముతున్న షాపులూ వెలిశాయి. ఇవన్నీ అభివృద్ధిలో ఓ భాగం కాదా అనే వితండవాదమూ రకరకాల ముసుగుల్లో హోరెత్తుతోంది. సన్మానాలు, సత్కారాల ప్రియులకు ప్రతి సాయంత్రం విందు భోజనమే. గాయత్రి లాంటి నిత్య స్వాప్నికులతో నిండిన సమాజంలో కళారాధన మూడు అవార్డులు, ఆరు సన్మానాలుగా వర్ధిల్లుతోంది. ఇంతటి గందరగోళ పరిస్థితుల్లో అభివృద్ధి, గ్లోబలైజేషన్‌కు అసలైన నిర్వచనం ఏమిటనే సందిగ్ధం సామాన్యుడిని తొలుస్తోంది.

తొలి కవితా సంపుటితోనే...

ఆమె ఒకే ఒక్క కవితా సంపుటి "అమ్ములపొది' వెలువరించింది. అయితేనేం.. అఖిల భారత స్థాయిలో కెళ్ళింది. తెలుగు సాహిత్యరంగంలో కాలుపెట్టింది మొదలు వివిధ పత్రికల్లో, కవిసమ్మేళనాల్లో లక్ష్మీ సుజాత తన కవితా గళం విప్పారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో క్యాజువల్ ఎనౌన్సర్, మనీషా సాహిత్య సాంస్కృతిక సేవా స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకురాలు.

చలపాక ప్రకాష్

ఈమె మనీషా కంప్యూటర్స్, పబ్లికేషన్ వ్యవస్థాపకురాలు. ఈ విధంగా వివిధ కోణాలలో తన "ప్రతిభ"ను, ప్రత్యేకతను చాటుకుంటున్న లక్ష్మీ సుజాత, మహిళలు తన కాళ్ళమీద తాను నిలబడగలగాలనే పట్టుదల, మనస్తత్వం ప్రదర్శిస్తారు. లీలా కుమారి, వెంకటరామారావు దంపతులకు జన్మించిన చింతా లక్ష్మీ సుజాత యం.ఏ సోషియాలజీ, పబ్లిక్ రిలేషన్స్ డిగ్రీ పూర్తి చేసారు. రెండు పదుల వయస్సులో సాహిత్యరంగంపై తనకున్న మక్కువతో సాంస్కృతిక చేసిన "డాక్టర్స్ డైరక్టరీ" ప్రజలకు ఎంతో ఉపయోగకారిగా నిలిచింది, ఆ తర్వాత కృష్ణాజిల్లాలో కవులు, రచయితలు, మిమిక్రి కళాకారులు, నాటకరంగ ప్రముఖులు తదితర సాహిత్య సాంస్కృతిక కళారంగాలలో కృషి చేసిన, చేస్తున్నవారి వివరాలతో కూడిన "కృష్ణాజిల్లా కల్చరల్ డైరక్టరీ" ని వెలువరించి కళా సేవకు రాలిగా అందరి అభినందనలు అందుకున్నారు. తాను వివిధ పత్రికలలో రచించిన కవితలతో 2004 చివరి అంకంలో 'అమ్ములపొది' పేరుతో కవితా సంపుటి ప్రచురించారు. అది వెలువరించిన తన స్వంత సంస్థ నుండే కాకుండా నగరంలోని 'బెజవాడ యువకలాలు', అభ్యుదయ రచయితల సంఘం వంటి పలుసాహిత్య సంస్థలలోనూ తగు బాధ్యతలు నిర్వహించుతున్నారు. పలు ఇతర సంస్థలు నిర్వహించే కవిసమ్మేళనాలకు, సభలలో కూడా సమర్థవంత మైన'కార్యకర్త'గా కృషి చేస్తారు.

1992 సం॥లో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక సమాఖ్య వారు నిర్వహించిన కవితల పోటీలలో శ్రీ శ్రీ స్మారక బహుమతిని, 1994లో భారతీయ సాహిత్య పరిషత్‌వారు, వికాస భారతి వారు నిర్వహించిన వేర్వేరు కవితల పోటీలలో ద్వితీయ, ప్రత్యేక బహుమతులు, భారతి మిత్ర వారు నిర్వహించిన కవితల పోటీలలో దేవులపల్లి కృష్ణశాస్త్రి స్మారక బహుమతి పొందారు. 1995 లో 'కళ్యాణి కళాసంస్థ హైద్రరాబాద్ వారిచే 'సాహితీ, కళ ఆవార్డు' 1995,96లో రసభారతి వారిచే ఉగాది పురస్కారం, 1998 సాంస్కృతిక సమాఖ్యవారి మహిళా దినోత్సవ పురస్కారం 1999 'వాయిస్' వారిచే ఉగాది పురస్కారం, సమాఖ్య ద్వారా కవయిత్రిగా కాలువోపి అంచెలంచెలుగా ఉన్నత స్థాయిలోకి ఎదగగలిగారు. స్త్రీకి ఉద్యోగ భద్రత, తద్వారా వ్యక్తిత్వానికి స్వేచ్ఛా స్వతంత్రాలు లభిస్తాయని సుజాత విశ్వసిస్తారు. ఆంధ్రభూమి, విశాలాంధ్ర, నేటి నిజం, రమ్యభారతి తదితర అనేక పత్రికలలో కవితలు, సాహిత్యవ్యాసాలు రాస్తూ పాఠకుల మన్ననలు పొందుతున్నారు. ఆకాశవాణి ద్వారా పలుమార్లు స్వీయకవితా గానం, ప్రత్యేక కదంబకార్యక్రమాలు నిర్వహించారు. దూరదర్శన్‌లో కూడా తన స్వీయనిర్వహణలో కవిసమ్మేళనాలు, స్క్రిప్టురైటర్ బాధ్యతలు చేపట్టారు. పలు రచయిత్రుల ఇంటర్వ్యూలు చేసి మంచి యాంకర్ గా కూడా గుర్తింపు పొందారు.

మనీషా పబ్లికేషన్స్ స్థాపించిన తదుపరి తొలి ప్రయత్నంగా విజయవాడ నగరంలో ఉన్న పలు విభాగాల డాక్టర్లు, హాస్పటల్స్ వివరాలను పొందుపరిచి నగర ప్రజలకు ఉచితంగా పంపిణి రెండు నెలల్లోనే 'అఖిల భారత కవయిత్రుల సమ్మేళనం' వారు ఇచ్చే ఉత్తమ కవితా సంపుటి పురస్కారం 'అమ్ములపొది'కే వచ్చింది. ఈ సందర్భంగా ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా॥ సి నారాయణ రెడ్డి చేతులమీదుగా పురస్కారం అందుకుని అయన నుండి ప్రత్యేక ప్రశంసలు పొందారు.

మనీషా' సాహిత్య సాంస్కృతిక సేవా స్వచ్ఛంద సంస్థను స్థాపించి ప్రజలకు ఎంతో సేవను అందిస్తున్నారు. అశ్లీల చిత్రాలు, అసభ్య వాల్‌పోస్టర్‌ను ఖండిస్తూ మేధావుల సదస్సు, జలయజ్ఞం వంటి సామాజిక అంశాలపై కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్ని చైతన్యవంతం చేసే దిశగా తనవంతు పాత్రను నిర్వహించారు 2004లో 'కవిమిత్రా' అవార్డు, ఇలా ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. స్త్రీ స్వేచ్ఛకోసం, సమాజంలో స్త్రీ భద్రతకు ఉద్యోగమే ఒక సాధనంగా మహిళ తన కాళ్ళపై తాను నిలబడగలగాలనే లక్ష్యాన్ని ప్రకటించిన సుజాత మహిళా లోకానికి ఆదర్శప్రాయం.

నవయుగ వైతాళికుడా...

జూన్ 15, మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా

ప్రపంచపు ఎల్లలన్నింటిని ఎదిరించి
మరో ప్రపంచ శిఖరాన్ని అధిరోహించి
జగన్నాథ రథ చక్రాల్ పరుగులెత్తించి
బాధా సర్పద్రష్టుల గుండెలలో నడయాడె
కవితాలలామని విప్లవ వలువలు కట్టించి
కవితాఝురీ ప్రవాహాన్ని కొత్తపుంతల నడిపించె
నవరసాలను తన కవితలతో పలికించి
చైతన్య శంఖారావాన్ని సాహిత్యంతో సంధించె
పీడిత, తాడిత కంఠీరవాల గర్జనల గుదిగుచ్చి
కరాలసత్తువ, నరాలనెత్తురు, కాలేకడుపు
మండే గుండెల భగభగల, భుగ భుగల
మరో ప్రపంచ అగ్ని కెరటాల్లా వెల్లువెత్తించె
కార్మికలోకం ఎదిరించి బిగించిన కొడవళ్ళు
శ్రామికలోకం బిగించి సంధించిన ఉక్కు పిడికెళ్ళు
శ్రీశ్రీ గర్జనల సమ సమాజపు పరవళ్ళు
జగత్తునే గజగజలాడించిన నూతన సవాళ్ళు
సామ్రాజ్యవాద దోపిడి వలువలు లాగివేసి

పెట్టుబడిదారుల బండారాన్ని బజారుకీడ్చివేసి
బూర్జువాల బూజుదులిపి ఎండగట్టి ఎగురవేసి
అరుణోదయ కాంతి పుంజాల ప్రజ్వలింపజేసే
నవతరాన్ని వెన్నుతట్టిన నవయుగ వైతాళికుడు
యువతరాన్ని జగన్నాథ రథసారథులు జేసిన
నవయువకుడు మానవ కళ్యాణానికి మరో
ప్రపంచాన్ని చూపిన దార్శనికుడు
నూతన సమాజాన్ని కవ్వించి విప్లవించిన
విప్లవకారుడు
మహాప్రస్థాన శ్రీరంగం శ్రీనుడికి అభ్యుదయాంజలి
ఖడ్గసృష్టి శ్రీశ్రీకి విప్లవాంజలి
చైతన్య కవితాఝురికి అరుణాంజలి
నూతనశక సృష్టికర్తకి హృదయాంజలి

- వడ్లమాను వెంకటేశ్వర్లు

శోధన సాధిస్తుంది

-ఆడిగోపుల వెంకటరత్నమ్

వాన పాతది
గాలి పాతది
వయసు వేల కోట్లవత్సరాలు
ఐనా నిత్యం కొత్తవి!
చిరుజల్లు తాకినపుడు
బీజం మొలకెత్తుతుంది
చిరుగాలి వీచినపుడు
జీవం పులకించుతుంది
ఒకానొక కొత్తరూపు
ఒకానొక కొత్తక్రియ!
మనిషి వేషం వేస్తాడు
కాలానికి వేషం వేయిస్తాడు
రెండు మార్గాలు
రెండు మాటలు
రెండు చేష్టలు
అసాంఘికం అకృత్యం
అరాచకం అమానవీయం
అన్నీ కూడికలు చేస్తాడు
తీసివేతల వాడకం వుండదు!

విరామాలు ముగుస్తాయి
యుద్ధాలు ఆరంభమౌతాయి
యుద్ధాలు ముగుస్తాయి
విరామాలు ఆరంభమౌతాయి
అబద్ధమూ నిజము
కరచాలనం చేసి
మూడోచేతిని కలుపుకుంటాయి
నాలుగో హస్తం పిలవకనే కలుస్తుంది
న్యాయమూ అన్యాయము
పరిణయ మాడుతాయి!
కొండెక్కిన న్యాయం
కోరితే దిగిరాదు
పాతాళాన దాగిన నిజం
వేడితే పైకిరాదు
దీక్ష శోధిస్తుంది
శోధన సాధిస్తుంది!

ఓరి!

బిర్యానీ వడ్డించలేదని...!

"**అల్లా,** వారి తండ్రి పర్వదిగార్ కలిసివచ్చి చెప్పినా చెప్పవచ్చుగాక...హరిహరాదులు చౌక్కాపుచ్చుకుని అడిగినా అడుగుగాక...ఏసుక్రీస్తు, ఆదిదేవుడైన యెహోవా ఇద్దరూ నా నెత్తిపై మొట్టికాయలేసినా వేయవచ్చుగాక...వినను గాక వినను. తలాక్...తలాక్...తలాక్..." అనేశాడొక కొత్త పెళ్ళికొడుకు. ఉత్తరప్రదేశ్‌లోని పిలిబిత్‌లో పన్నూ అనే యువతిని రియాజుద్దీన్‌కు ఇచ్చి నిఖా చేసి ఓ మూడు గంటలు కూడా కాలేదు. భోజనాల దగ్గర నానా యాగీ అయి ఈ పరిస్థితికి దారితీసింది. పెండ్లి కుమారులుంగారికి పెళ్ళి డిన్నర్‌లో బిర్యానీ వడ్డించలేదు. అంతే...సదరు బిర్యానీ కా గులామ్ తన బీబీ కో తలాక్ అనేశాడు. అంతమాత్రానికే ఇంత మాట అంటావా అని ముల్లాలు తదితర పెద్దలు ఊరుకోలేదనుకోండి. "బీబీ కావాలా బిర్యానీ కావాలా వెధవకానా..." అని చివాట్లు పెడితే ఖాళీ అయిపోయిన బిర్యానీ బేసిన్ల వంక లొట్టలు మాత్రమే వేస్తూ చూస్తుండిపోయుంటాడు మన రియాజుద్దీన్ దుల్హా.



వేపుకు తింటే సరి!

"**తి**ట్టినా కొట్టినా అదుపులోకి రాకపోతే ఆరగించేసేయ్" అనేది థాయ్‌లాండ్ వారి సరికొత్త పాలసీగా ఉందిట! ఏం చేస్తారుమరి చెప్పండి? కంచనబరీ ప్రావెన్స్‌లో చెదపురుగులు ఇంటి అల్లుళ్ళ మాదిరిగా నూటికి అరవై వంతుల పంటల్ని భోంచేశేసాయట! ఆ చెదమహారాజులను ఎన్నిరకాల సంప్రదాయబద్ధ పద్ధతుల్లో అరికట్టాలని చూసినా లొంగలేదుట. అన్ని రకాల పురుగుమందులు కొట్టి చూశారు. ప్రమాదస్థాయి పురుగుమందులు కూడా కొన్ని చోట్ల కొట్టి చూశారు. చెద జాతి చెక్కు చెదరలేదు. ఈపాటికి అక్షరాలా పదహారు వందల హెక్టార్ల పంటపొలాల పంటల్ని నమిలి ఊసాయి. చేసేదేమిటో తోచక అధికార, అనధికార వర్గాలు పైన చెప్పిన పాలసీని ప్రకటించాయి. చిమ్మెటలు లాంటివాటిని ఎంచక్కా వేయించి పేలాల మాదిరిగా "వేడివేడి... డబ్బా అర్థరూపాయి" అన్నట్లు ఈ "చెదపురుగూస్ పాప్‌కార్న్" తినడం మొదలెట్టమని అంటున్నారు. వాటి పునరుత్పత్తికి అవకాశం లేనంతగా వేపుకుతినడం చేస్తే వాటి జీవిత చక్రం ఆగిపోతుందని, ఆవిధంగా చేసిచూద్దామా అని బాండీ, నూనె, పెద్ద గరిటెతో రెడీ అయిపోయారు.



కుంభకర్ణాస్...మీకోసమే...!!

ప్రపంచవ్యాపిత సమస్యల్లో గురకకూ...దానికి మూలమైన నిద్రకూ...నిద్ర అనంగానే గుర్తుకువచ్చే కుంబకర్ణులవారికి కూడా స్థానం దక్కింది. గురక గురువరేణ్యులు ఇందు కలరందు లేరను సందేహం వలదన్నట్లు ప్రపంచమంతటా ఉన్నారులేండి. నదరు గురక మీద తీవ్రంగా ఆలోచించీ...యోచించీ...చించీ...ఛీ...గురక తీసిన వారుకూడా లేకపోలేదు. అయితే గురకకు తావులేకుండా గురక గురించి జర్మనీ, మ్యూనిచ్‌లో ఉన్న లుడ్విక్- మాక్సిమిల్లన్ యూనివర్సిటీ పరిశోధకులు శోధించారు. అందుకు ఒక పూర్తి రాత్రి నిద్రాధ్యయనానికై "హంసతూలికా..." సారీ...వెరీవెరీ సారీ..."ఫైబర్‌తూలికా తల్పం" ఒకటి రూపొందించారు. ఆ తల్పంపై పరుండినవారి "ఆబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ఎప్నియా సింద్రోమ్"(ఒఎస్‌ఎఎస్) తీవ్రతను లెక్కిస్తారు. అందుకు నిద్రాసనులైనవారు వారి గురకకి వారే ఝుడుసుకోకుండా ఇయర్ బగ్స్ కూడా ఏర్పాటుచేశారు. అబ్బ...ఏం సుఖం ఏం సుఖం... నిద్రాపరిశోధన మాట కుంభకర్ణుడెరుగునో లేదో...యమాగా నిద్ర పట్టేసి గుర్రుపెట్టి నిద్రపోవచ్చునుకునేవాళ్ళనిట్లే ఆకర్షించిందా ఫైబర్‌బెడ్.

అప్పాలు

తయారుచేసే విధానం:

మైదా పిండిని జల్లించుకోవాలి. బియ్యం పిండి, మైదా కలుపుకోవాలి. వాము, జీలకర్ర, ఉప్పు, డాల్డా వేసి నీళ్ళు పోసి గట్టిగా కలపాలి. వాటిని అప్పాలుగా పల్చగా వత్తుకోవాలి. పొయ్యి మీద బాండీలో నూనెపోసి కాగనివ్వాలి. నూనె కాగాక ఈ అప్పాలన్నిటినీ దోరగా వేయించుకోవాలి. వీటిని స్వీట్‌గా కూడా చేసుకోవచ్చు. వాము, ఉప్పు, జీలకర్ర వేయకుండా కొద్దిగా బెల్లం వేసి అప్పాలు పల్చగా చేసి దోరగా వేయించుకోవాలి.

కావలసిన వస్తువులు:

కొట్టిన బియ్యం పిండి	:	అర కిలో
మైదా	:	ఒక కిలో
వాము	:	ఒక టేబుల్ స్పూన్
జీలకర్ర	:	ఒక టేబుల్ స్పూన్
ఉప్పు	:	తగినంత
డాల్డా	:	వంద గ్రాములు
నూనె	:	అర కిలో

కావలసిన వస్తువులు:

సేమ్యా :	పావు కిలో	నెయ్యి :	వంద గ్రాములు
కొబ్బరి :	పావు కిలో	ఏలకులు :	పది
పంచదార:	అర కిలో	కిస్‌మిస్ :	పది
జీడిపప్పు:	50 గ్రాములు		

సేమ్యా కొబ్బరి లడ్డూలు

తయారుచేసే విధానం:

ముందుగా సేమ్యాను రెండు స్పూన్లు నెయ్యి వేసి దోరగా వేయించుకోవాలి. కొబ్బరి తురుము కోవాలి. కొబ్బరిని కూడా కొంచె నెయ్యి వేసి దోరగా వేయించాలి. జీడిపప్పు, కిస్‌మిస్ కూడా నెయ్యిలో వేయించుకోవాలి. యాలకులు పొడి చేసుకోవాలి. పంచదార మెత్తగా మిక్సీలో పిండిలాగా వేసుకోవాలి. అలాగే సేమ్యా కూడా మిక్సీలో మెత్తగా వేసుకోవాలి. వీటన్నిటినీ బాగా కలుపుకోవాలి. మిగిలిన నేతిని వేడి చేసి దానిలో పోసి బాగా కలపాలి. చిన్న చిన్న లడ్డూలుగా చేసుకోవాలి..ఇవి చాలా తొందరగా అయిపోతాయి. చేసుకోవడం చాలా తేలిక. చాలా రుచిగా ఉంటాయి.

కలంస్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్ ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్: **కలం స్నేహం**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : జుట్టుకొండ సారిక
వయసు : 9 సం॥
చదువు : 4వ తరగతి
హాబీలు : టీవీ చూడడం, అల్లరి చేయడం, ప్రజాశక్తి చదవడం
లక్ష్యం : డాక్టరు కావడం
స్కూలు : ది హుజూర్‌నగర్ హైస్కూల్
చిరునామా : **జుట్టుకొండ సారిక**, డాటరాఫ్ లక్ష్మయ్య, కీతవారిగూడెం (గ్రా), గరిడేపల్లి (మం), నల్లగొండ-508201.

పేరు : జె.రాధ బాబు
వయసు : 12 సం॥
చదువు : 8వ తరగతి
హాబీలు : ప్రజాశక్తి అనుబంధం చదవడం, క్రికెట్ ఆడటం
స్కూలు : అప్పర్ ప్రైమరీ స్కూల్
లక్ష్యం : సైంటిస్టు కావడం
చిరునామా : **జె.రాధ బాబు**, సన్నాఫ్ నాగులు, తూటికుంట్ల (గ్రా), బోనకల్ (మం), ఖమ్మం- 507208.

పేరు : ఎల్.జీవన్
వయసు : 16 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : పాటలు పాడడం, కవితలు రాయడం, మిమిక్రీ చేయడం, న్యూస్ చూడడం, ప్రజాశక్తి చదవడం
స్కూలు : విద్యారణ్య ఉన్నత పాఠశాల
లక్ష్యం : కళాకారుడు, కవి, విలేకరి కావడం.
చిరునామా : **ఎల్.జీవన్**, సన్నాఫ్ పి.జగన్నాథం, ఇంటి నెం.1-8-120, బాలసముద్రం, హన్మకొండ, వరంగల్-506001

పేరు : పలాసి నాగేష్వర్ నానీ
వయసు : 15 సం॥
చదువు : 9వ తరగతి
హాబీలు : పాటలు పాడడం, ప్రజాశక్తి చదవడం, టీవీ చూడడం, క్రికెట్, వాలీబాల్ ఆడడం, డ్యాన్స్‌చేయడం
స్కూలు : జిప హైస్కూల్
లక్ష్యం : డాక్టరు కావడం
చిరునామా : **పలాసి నాగేష్వర్ నానీ**, సన్నాఫ్ చిట్టిబాబు, వై.సోలములు, పాడేరు (మం), విశాఖపట్నం.



పేరు : ఎస్.ఈరన్న
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : టీవీ చూడడం, ప్రజాశక్తి ఆదివారం అనుబంధం చదవడం, ఆటలు ఆడడం
లక్ష్యం : రిపోర్టర్ కావడం
స్కూలు : నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ స్కూల్
చిరునామా : **ఎస్.ఈరన్న** సన్నాఫ్ ఎస్.ఆదెప్ప, ఇంటి నెం.10-2-4, మరాఠివారి వీధి, చాకలిగేరి, ఆదోని, కర్నూలు-518301.

పేరు : పులి వెంకట్రావు
వయసు : 13 సం॥
చదువు : 8వ తరగతి
హాబీలు : క్రికెట్ ఆడడం, పుస్తకాలు చదవడం, సంగీతం వినడం, టీవీలో వార్తలు చూడడం, సినిమా పాటలు పాడడం, కలం స్నేహం చేయడం
స్కూలు : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
చిరునామా : **పులి వెంకట్రావు**, సన్నాఫ్ పి.వెంకటేశ్వర్లు, ఇంటి నెం.6-6-122/6/ఎ, జడ్ ఉప్పలపాడు (గ్రా), ఏలేటివారిపాలెం (మం), ప్రకాశం.

పేరు : పి.ప్రవీణ్
వయసు : 14 సం॥
చదువు : 8వ తరగతి
హాబీలు : క్రికెట్ ఆడడం, ప్రతిరోజూ ప్రజాశక్తి చదవడం
చిరునామా :
పి.ప్రవీణ్, సన్నాఫ్ ఇస్సాకు, ఎస్‌సి-బిసి కాలనీ, తర్లుబాడు రోడ్డు, మార్కాపురం, ప్రకాశం-523316.

పేరు : ఎస్‌కె.అబ్దుల్ మహబూబ్ హుస్సేన్
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్ ఆడడం, పేపర్ చదవడం, టీవీ చూడడం
స్కూలు : సాకేత్ హైస్కూల్
లక్ష్యం : ఆర్మీలో ఉద్యోగం సంపాదించడం
చిరునామా : **ఎస్‌కె.అబ్దుల్ మహబూబ్ హుస్సేన్** సన్నాఫ్ ఎస్‌కె.అబ్దుల్ ఖయ్యూమ్, ఇంటి నెం.2-7, కావల్‌గడ్డ వీధి, గోపాల్ పేట్, మహబూబ్‌నగర్.